

ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు

5
గురువారం 14 నవంబరు 2024



“ఎన్టీఆర్ జలసిరి.. భూగర్భ జలాలతో పంటలు పండించుకునే వారికి వరం. రైతులకు బోరు బావులతో సాగునీటి భరోసా కల్పించేలా.. చిన్న, సన్న కారు రైతుల వ్యవసాయ భూమిని సేద్యానికి అనుకూలంగా మార్చేందుకు భూగర్భ జలాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకునేలా బోర్ల నిర్మాణ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పట్లో ఈ పథకంలో రైతు లకు ఉచితంగా బోర్లు వేయించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పథకం పేరును వైఎస్ఆర్ జలసిరిగా మార్చింది. అయితే అమలులో చిత్తశుద్ధి లోపించింది. ఈ పరిస్థితుల్లో రైతులు ఐదేళ్లుగా బోర్ల నిర్మాణం కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. దరఖాస్తుల స్వీకరణతోనే వైసీపీ పాలకులు సరిపెట్టారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరించింది. సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రత్యే కంగా నిధులు కూడా కేటాయించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని సామాన్య రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఐదేళ్లుగా నిలిచిపోయిన వ్యవసాయ బోర్లను తిరిగి నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుండటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.”

- పథకాన్ని పునరుద్ధరించిన ప్రభుత్వం
- బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల కేటాయింపు
- రైతుల ఆశలు ఫలించినట్లే.. బోర్ల నిర్మాణానికి చర్యలు
- ఐదేళ్లుగా వైసీపీ హయాంలో అటకెక్కిన బోర్ల నిర్మాణం

ఇక.. ఎన్టీఆర్ జలసిరి


వ్యవసాయ బోరు

క్లస్టర్ల వారీగా బోర్ల నిర్మాణం...

క్లస్టర్	దరఖాస్తుల సంఖ్య	ఆమోదించినవి	నిర్మించినవి
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,894	1,532	134
మాచర్ల	5,061	4,170	741
వినుకొండ	2,563	1,954	200
గుంటూరు	197	157	11
తెనాలి	279	229	122
బాపట్ల	314	236	75
చీరాల	4210	3492	821


విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన బోరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
అటకెక్కిన బోర్ల నిర్మాణ పథకానికి కూటమి ప్రభుత్వం ఊతం ఇచ్చింది. ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరించింది. త్వరలోనే ఎన్టీఆర్ జలసిరి బోర్ల నిర్మాణం పట్టాలెక్కనుంది. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టి రైతులకు వ్యవసాయ బోర్లు నిర్మించారు. సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేశారు. తిరిగి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే జలసిరికి నిధులు మంజూరు చేసింది. చిన్న సన్న కారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయం బోరు బావులను ఉచితంగా నిర్మించేందుకు నాడు టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరికి శ్రీకారం చుట్టి వేలాది బోర్లను నిర్మించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకం పేరు మార్చడంలో చూపిన శ్రద్ధ బోర్ల నిర్మాణంపై లేకుండా పోయింది. వైఎస్ఆర్ జలకళను ఆర్భాటంగా ప్రవేశపెట్టిన పాలకులు అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపలేదు. దీంతో (మిగతా 6వ పేజీలో..)


గతంలో టీడీపీ ప్రభుత్వ నిర్మించిన వ్యవసాయ బోరు.. సోలార్ పంపు సెటు



అనుసంధానం

- ప్రతి ఇంటికీ ఇక జియో ట్యాగింగ్
- సచివాలయ సిబ్బందితో హౌస్‌హోల్డ్ జియో మ్యాపింగ్
- విపత్తుల సమయంలో కీలకం కానున్న ట్యాగింగ్
- ఆధార్, ఫోన్ నెంబర్లతో ప్రమాదంలో ఉన్నవారిని గుర్తించే వీలు
- తద్వారా వారికి సహాయం అందించేలా చర్యలు
- బ్యాంకు ఖాతాల ఆధార్ లింకేజీపైనా ప్రత్యేక డ్రైవ్

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనుకోని విపత్తు వచ్చింది. ఎవరు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. వారిని వెదకడం కష్టంగా మారింది. అలాంటి సమయంలో వారిని ఎలా గుర్తించాలి? ఎలా సహాయం అందించాలి? ఎలా కాపాడాలి? ఎలాంటి కమ్యూనికేషన్ లేని విపత్కర సమయాల్లో బాధితులను గుర్తించి కాపాడడం ఎలా? ఇటీవల విజయవాడ వరద విపత్తు సమయంలో ప్రభుత్వానికి ఎదురైన సమస్య ఇది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. ఎవరెవరు ఎక్కడ నివసిస్తున్నారు.. వారిని సమన్వయం చేసే ఏకైక వ్యవస్థ ఏంటి అనేదానిపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఒక వ్యక్తి పేరు, అతడి ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరు లేదా ఇంటి నెంబరు.. ఇలా ఏదో ఒక నెంబరుతో వారి వివరాలు, వుండే ప్రాంతాన్ని కచ్చితంగా గుర్తించి వారికి సహాయం అందించేందుకు మార్గాన్ని కనుగొంది. అదే 'హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్!' ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేస్తే ఏదో ఒక చిన్న ఆధారంతో ప్రమాదంలో చిక్కుకుపోయిన వారిని గుర్తించి తక్షణ సహాయం అందించ వచ్చని భావించింది. వరదలో కొట్టుకుపోయేవారికి గడ్డిపోచ కూడా ఆసరాగా మారినట్లు ఈ జియో ట్యాగింగ్ విధానంలో ఒక చిన్న వివరం వారి కుటుంబ సభ్యులందరినీ రక్షించే అవకాశం కల్పించబోతోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఒక సారి జియో ట్యాగింగ్ అయితే తుఫానులు, వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ఏదో ఒక చిన్న ఆధారంతో బాధితుల వివరాలు తెలుసుకుని వారికి సహాయం అందించవచ్చు. ఒక ఇంటికి సంబంధించి ఏ చిన్న వివరం తెలిసినా ఆన్‌లైన్లో వాటిని నమోదు చేస్తే మొత్తం వివరాలతోపాటు ఆ ఇంటి లోకేషన్ కూడా కళ్ల ముందు కనిపించేలా ఈ హౌస్‌హెల్డ్ జియో ట్యాగింగ్‌ను రూపొందిస్తోంది.

ప్రతి ఇంటికీ జియో ట్యాగింగ్..

కూటమి ప్రభుత్వం హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి ఇంటినీ ప్రభుత్వంతో అనుసంధానిస్తోంది. గతంలో సంక్షేమ పథకాల ఆధారంగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ఉండేది. ఉదాహరణకు పింఛన్లకు సంబంధించి ఒక మ్యాపింగ్, రేషన్ కార్డులకు సంబంధించి మరో మ్యాపింగ్. అలా ఆయా పథకాలకు సంబంధించిన మ్యాపింగ్ మాత్రమే వుండేది. ఫలితంగా ఆయా పథకాల పంపిణీకి మాత్రమే అవి ఉపయోగ పడేవి. ఈ చిక్కులను తొలగించి మొత్తం వ్యవహారాన్ని ఒక చోటికి తెచ్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతి ఇంటిని ఆ ఇల్లు ఉండే అక్షాంశం, రేఖాంశం ఆధారంగా జియో ట్యాగింగ్ చేస్తోంది. ఈ పద్ధతి ద్వారా ఎవరెక్కడ ఉన్నారనే విషయం సెకన్లలో తెలిసిపోతుంది. ఒక వ్యక్తి, ఆ కుటుంబ సభ్యులు, వారు నివసించే ఇల్లు, ఆ ఇల్లు పూరిల్లా, రేకుల ఇల్లా, పక్కా ఇల్లా.. వంటి వివరాలు, వీధి సమాచారం సహా మొత్తం అధికారుల లాగిన్లో కనిపిస్తాయి. మ్యాపులో వారున్న (మిగతా 8వ పేజీలో..)

జియో ట్యాగింగ్ ఇలా..

రాష్ట్రంలోని ప్రతి కుటుంబ వివరాలను ప్రభుత్వం జియో ట్యాగింగ్‌లో నమోదు చేస్తోంది. జీఎస్‌డబ్ల్యూఎస్ ఎంప్లాయిస్ మొబైల్ యాప్ అనే యాప్‌లో జియో ట్యాగింగ్ చేస్తారు. ఆ యాప్‌లో ప్రతి ఇంటి ఫొటో, డోర్ నెంబరు, లొకేషన్‌ను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అప్లోడ్ చేస్తారు. ప్రతి కుటుంబం వద్దకు సచివాలయ ఉద్యోగులు వెళ్లి ఆ కుటుంబానికి చెందిన ఇంటిని అప్లోడ్ చేసి వాటిని ధ్రువీకరించేలా కుటుంబ సభ్యుల్లో ఒకరితో ప్రత్యేక డివైజ్ ద్వారా వేలి ముద్రలు, ఫేస్, ఐరిష్ పద్ధతిలో ఆమోదం తీసుకుంటారు.

- అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్న కలెక్టర్
- పెదకాకాని, కొప్పురావూరు, ఉప్పలపాడులో నాగలక్ష్మి పర్యటన

పల్లెపండుగ పనులు పూర్తి చేయాలి


మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పెదకాకాని, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగలో భాగంగా మంజూరు చేసిన మౌలిక సౌకర్యాల అభివృద్ధి పనులు వెంటనే పూర్తి అయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం మండలంలోని పెదకాకాని, కొప్పురావూరు, ఉప్పలపాడు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పెదకాకానిలో అంగన్వాడీ కేంద్రంలో నిర్మిస్తున్న రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణాన్ని, పోషణ్ వాటికకు గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ చిన్నారులకు ఇంగ్లీష్ అక్షరాలు, రంగుల గుర్తించడంలో వారి సామర్థ్యాలను పరీక్షించారు. చిన్నారులకు ఆంగ్ల అక్షరాలు, పాటలు, రంగులపై అర్థమయ్యేలా బోధన చేయాలని అంగన్వాడీ టీచర్‌కు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు సక్రమంగా సరుకులు సరఫరా అయ్యేలా సూపర్వైజర్లు, ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. పుష్పరాజ్‌కాలనీలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా నిర్వహించి నిర్దేశిత సమయంలో పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పల్లెపండుగలో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసిన సీసీ రోడ్డు, కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేసిన ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. పెదకాకానిలో స్థానికులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కొప్పురావూరులో నిర్మిస్తున్న పశువుల పాకను కలెక్టర్ పరిశీలించి, లబ్ధిదారుల ఆదాయ వివరాల గురించి తెలుసుకున్నారు. కుక్కలు, కోతుల బెడదా ఎక్కువగా ఉందని, పొగాకు కాలుష్యంపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాజధాని ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే లైనును గ్రామం మధ్యలో నుంచి కాకుండా మార్చాలని కోరారు. పొగాకు ఫ్యాక్టరీకి సంబంధించి కాలుష్య నియంత్రణ అధికారులతో తనిఖీ చేయిస్తామని కలెక్టర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఉప్పలపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న రూఫ్‌టాప్ రైయిన్ వాటర్ హార్వెస్టింగ్‌స్ట్రక్చర్ పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. డిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న, స్వర్ణాంధ్ర విజన్ ప్రేరణలో బహుమతులు సాధించిన, జాతీయ స్థాయిలో వాలీబాల్, హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. గ్రామంలో జరుగుతున్న ఇళ్ళ జియో ట్యాగింగ్, ఎన్‌సీపీ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల రోడ్డు సక్రమంగా లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, డ్వామా పీడీ శంకరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణకాంత్, ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కామినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు గోళ్ళ స్వరుపారాణి, ఆలా సాంబశివరావు, కే శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లాలో స్టడీ అవర్స్ ప్రారంభం
- సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ
- ఇప్పటికే 90 శాతంపైగా సిలబస్ పూర్తి
- స్టడీ మెటీరియల్, అల్పాహారం పంపిణీకి ఏర్పాట్లు

పదికి పకడ్బందీగా ప్రణాళిక

గుంటూరు(విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్యచరణ సిద్ధం అయింది. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులు దిశానిర్దేశం చేయడంతో పాఠశాలల్లో రెండు రోజుల నుంచి స్టడీ అవర్స్ ప్రారంభం అయ్యాయి. స్టడీ అవర్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు విద్యార్థులకు సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలు నివృత్తి చేయడానికి ఉపాధ్యాయులకు ప్రత్యేక టైమ్ టేబుల్‌ను విద్యాశాఖ సిద్ధం చేసింది.


గుంటూరులోని ఎస్‌కేబీపీఎం స్కూల్‌లో ప్రత్యేక స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

పరీక్ష ఫీజుకు 18 వరకు గడువు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మోడల్ స్కూల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలలు 375కుపైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల నుంచి ఈ ఏడాది పది పరీక్షలకు దాదాపు 45,876 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు సమాచారం. ఇప్పటికే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో దాదాపు 95 శాతం మంది పరీక్ష ఫీజు చెల్లించారు. పరీక్ష ఫీజు గడువు ఈనెల 18వ తేదీ వరకు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలకు సన్నద్ధత దాదాపు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ముమ్మరంగా సాగుతోంది.

90 శాతం సిలబస్ పూర్తి

పాఠశాలల్లో పదో తరగతి సిలబస్ 90శాతం పూర్తి అయింది. సిలబస్ డిసెంబరు రెండో వారంలోగా నూరుశాతం పూర్తి అవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికే విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్-1,2 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల్ని గ్రేడింగ్ చేసి శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో సాయంత్రం 4.15 నుంచి 6 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల్ని చదివించడం, సందేహాలు నివృత్తి చేయడం, ముఖ్యమైన ప్రశ్నల్ని చదివించి వారంతంలో పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న వారి కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు.

త్వరలో స్టడీ మెటీరియల్ పంపిణీ

పది విద్యార్థుల కోసం జడ్పీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ త్వరలో పంపిణీ చేయనున్నారు. ఇటీవల జరిగిన సాధారణ జడ్పీ సమావేశంలో ఈమేరకు జడ్పీ ఛైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా పది విద్యార్థులకు పంపిణీ చేసే స్టడీ మెటీరియల్‌పై చర్చించారు. ఇందుకోసం దాదాపు రూ.40 లక్షలకుపైగా వ్యయం చేయనున్నట్లు సమాచారం. ఈ ఏడాది విద్యార్థులకు అల్పాహారం కూడా అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. యాజమాన్యాల వారీగా ఇందుకోసం ప్రభుత్వం బడ్జెట్‌నుకేటాయించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అనుబంధాలు ఆవిరి 8

- చిన్నారుల్లో కనిపిస్తున్న మానసిక రుగ్మత
- అమ్మ, నాన్నల పూర్తిపేరు కూడా చెప్పలేకపోతున్న వైనం
- తాత్కాలిక ఆనందాలకు అలవాటుపడుతున్న పిల్లలు
- నిర్ధారిస్తున్న సర్వేలు, మానసిక నిపుణులు
- చిన్నారుల మెదడుపై ప్రభావం చూపుతున్న సెల్‌ఫోన్లు
- పెద్దవాళ్లకు దూరంగా ఉండటం కూడా మరో కారణం

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

ఏపీ లా సెట్, పీజీ ఎల్.సెట్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్ 6

- నేటి నుంచి 17 వరకు రెండో విడత ప్రారంభం
- రేపటి నుంచి 19 వరకు ధ్రువపత్రాల పరిశీలన
- ఏపీ లా సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య సత్యనారాయణ

మరికొందరికి పదవులు

- రజక, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్లలో అవకాశం



జీరో వ్యాపారానికి సహకరిస్తే చర్యలు

- యార్డు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ భార్గవతేజ

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో వేమన్లు జీరో, రేట్ కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పర్సన్ ఇన్‌చార్జి, జేసీ భార్గవతేజ హెచ్చరించారు. బుధవారం యార్డు పరిపాలన భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యార్డులోకి వచ్చే ప్రతీ మిర్చి టిక్కీని ఎరైవల్స్‌లోకి తీసుకురావాలన్నారు. జీరో, రేట్ కటింగ్ బిజినెస్‌లను రూపుమాపాలని స్పష్టం చేశారు. సీజన్‌లో కాటాలు ఆలస్యం కాకూడదన్నారు. సమావేశంలో మిర్చియార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు, సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దిగుమతి వ్యాపారుల డుమ్మా

మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జి భార్గవతేజ ఏర్పాటు చేసిన సమావేశానికి దిగుమతి వ్యాపారుల సంఘ నాయకులు ముఖం చాటేశారు. మంగళవారం నుంచి యార్డు సూపర్‌వైజర్లు పలుమార్లు ఫోన్లు చేసి సమావేశం గురించి సమాచారాన్ని ఇచ్చినా వారు పట్టించుకోలేదు. తాము స్థానికంగా అందుబాటులో లేమని చెప్పి గైర్హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు లేకపోతే మిగిలిన వారు కూడా ఏ కారణంతోనే రాలేదు. చివరికి అధికారులు అనామకులను తీసుకొచ్చి సమావేశంలో కూర్చోబెట్టడం చర్చనీయాంశమైంది.

రాజకీయ ఒత్తిళ్లు ఉంటే మేమేమి చేయగలం

కొంతమంది అధికారులు తమపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని, లారీల కిరాయి విషయంలో ఏకాభిప్రాయానికి రావాలని సూచిస్తున్నారని ఇది సబబు కాదని మిర్చి ఎగుమతిదారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మార్కెట్‌లో అడ్డగోలుగా కూలీ, కిరాయి ఖర్చులున్నాయని, అందుకే ఎగుమతిదారులు దాచేపల్లి, వరంగల్, ఖమ్మం వైపు చూస్తున్నారని చెప్పారు. తాము ఎవరు తక్కువ కిరాయికి లారీ లోడింగ్‌కి పెడితే వారినే సంప్రదిస్తామని చెప్పారు. అలా కాకుండా ఎక్కువ కిరాయిని డిమాండ్ చేస్తున్న వారితో మాట్లాడుకోమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఎక్స్‌పోర్టర్లు ప్రశ్నిస్తున్నారు.


మిర్చియార్డులో వేమెన్లతో సమావేశమైన జేసీ భార్గవతేజ

సీఎం, లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే జీవీ



వినుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. చీఫ్‌విప్ పదవి ఇచ్చినందుకు సీఎంకు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని సీఎంకు చెప్పారు. సమర్థవంతంగా పని చేయాలని ఎమ్మెల్యేకి సీఎం సూచించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు.



ఏపీ లా సెట్, పీజీ ఎల్.సెట్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్

- నేటి నుంచి 17 వరకు రెండో విడత ప్రారంభం
- రేపటి నుంచి 19 వరకు ధ్రువపత్రాల పరిశీలన
- ఏపీ లా సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య సత్యనారాయణ

పెదకాకాని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఏపీ లాసెట్ కార్యాలయంలో రెండో విడత ఏపీ లా సెట్, పీజీ ఎల్.సెట్ 2024 అడ్మిషన్స్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ శాస్త్ర కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్, ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024ను జూన్ 9న నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎ.పి. లాసెట్ కార్యాలయంలో కన్వీనర్ ఆచార్య బి.సత్యనారాయణ విడుదల చేశారు. నేటి నుంచి ఈ నెల 17 వరకు వెబ్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 15 నుంచి 19 వరకు ఉంటుందన్నారు. ఈ నెల 20 నుంచి 23 వరకూ అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. వెబ్ ఆప్షన్స్‌లో మార్పులకు ఈ నెల 24 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 26న అడ్మిషన్స్ ఎలాట్‌మెంట్ జరుగుతుందని, 27 నుంచి 29 వరకు అర్హత పొందిన అభ్యర్థులు తమకు కేటాయించిన కళాశాలలో స్వయంగా హాజరు కావాలని కన్వీనర్ తెలియజేశారు.

ఇక.. ఎన్టీఆర్ జలసిరి

(5 పేజీ తరువాయి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఈ పథకం అమలులో చతికిల పడింది. బోరు బావుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది రైతులు వీటి నిర్మాణం కోసం ఎదురు చూశారు. భూగర్భ జలాలను సమవర్థవంతంగా సద్వినియోగం చేసుకునేందుకు ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని వైసీపీ పాలకులు ఐదేళ్ల రైతులకు అక్కరకు రాకుండా చేశారు. ఈ పరిస్థితుల్లో రైతుల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని అమల్లోకి తేవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గతంలో అమలు చేసినట్లుగా ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతులకు ఈ పథకాన్ని వర్తింప చేసేందుకు సిద్ధమైంది. అర్హులైన రైతులకు బోరు నిర్మించడంతో పాటు సోలార్ పంపు సెట్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిస్థితుల్లో బోర్ల నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జలసిరి పథకంలో బోర్ల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయింపుపై దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేలల్లో దరఖాస్తులు పెండింగ్‌లో..

టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం రైతుల కల మన వైఎస్ఆర్ జలకళ అనే నినాదంతో వైఎస్ఆర్ జలకళ పథకాన్ని రూపొందించింది. పథకానికి పేరు మార్చిన వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ బోర్ల నిర్మాణాన్ని అటకెక్కించింది. ఐదేళ్ల బోర్ల నిర్మాణంలో ప్రభుత్వం బొక్కాబోర్లాపడింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో 15,341 మంది రైతుల దరఖాస్తులను ఆమోదించినప్పటికీ బోర్ల నిర్మాణాన్ని విస్మరించింది. బోర్ల నిర్మాణం కోసం ఆశగా ఎదురు చూసిన అన్నదాతలకు అడియాసే మిగిలింది. ఈ పథకానికి ప్రధానంగా నిధుల కొరత వెంటాడింది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేకపోయారు. దీంతో వందలాది బోర్లు నిరుపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వకపోవడంతో అవి పూడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. జలసిరి పథకాన్ని జలకళగా మార్చిన వైసీపీ ప్రభుత్వం బోర్ల నిర్మాణాలను నామమాత్రంగా కూడా చేయలేదు. పల్నాడు జిల్లాలో 10,341 మంది రైతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 8,371 దరఖాస్తులను ఆమోదించినా 1,179 బోర్లు మాత్రమే నిర్మించారు. బాపట్ల జిల్లాలో 4524 దరఖాస్తులకు 3,728 ఆమోదించారు. వీటిలో భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి 2279 దరఖాస్తులపైనే సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన వాటిలో 2105 బోర్లు నిర్మాణానికి అనుమతించారు. వీటిలో 1779 బోర్లకు పరిపాలన అనుమతి రాగా 896 బోర్లను మాత్రమే నిర్మించారు. వీటిలో 63 బోర్లు విఫలమైనట్లు గుర్తించారు. 42 బోర్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. గుంటూరు జిల్లాలో 476 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 386 ఆమోదించారు. 181 భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన దరఖాస్తులలో 197 బోర్లు నిర్మాణానికి అనుమతిచ్చారు. వీటిలో 170 బోర్లకు పరిపాలన అనుమతి ఇచ్చారు. 133 బోర్లను మాత్రమే నిర్మించగా వీటిలో 34 పనిచేయడం లేదు. 44 బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

పనుల్లో జాప్యాన్ని నివారించడానికే అధికారి సేవల్ని కోరాం

- పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు(విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్జేడీ కార్యాలయంలో కొత్త అధికారి వచ్చే వరకు వివిధ విభాగాల్లో పనులు జాప్యం లేకుండా ఉండటానికే ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ద్వితీయ శ్రేణి అధికారిని డిప్యుటేషన్‌పై నియమించాలని కమిషనర్‌ను అభ్యర్థించామని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. 'డిప్యుటేషన్ పేరిట తిష్ట.. అవినీతికి పరాకాష్ట' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. ఆర్జేడీ కార్యాలయానికి ఉపాధ్యాయుల నుంచి వచ్చే వినతులు, కోర్టు కేసుల పరిష్కారం కోసం కొత్త అధికారి వచ్చే వరకు పాత అధికారి రెండుచోట్ల విధులు నిర్వర్తించేలా కమిషనర్‌ను అభ్యర్థించినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు, ఎన్‌వోసీ జారీ, ఎంఈవోలకు ఎఫ్ఏసీ అలవెన్స్‌లు మంజూరులో ఎటువంటి ఇబ్బందులకు గురిచేయలేదనీ, ఆర్జేడీ కార్యాలయంలో అవినీతికి ఆస్కారం లేదన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలు మెయిల్ ద్వారా పంపవచ్చునని, పనుల కోసం వచ్చే ప్రైవేటు, ఎయిడెడ్ స్కూల్స్ యాజమాన్యం నుంచి సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లు రుజువు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గంజాయి విక్రేతల ముఠా అరెస్టు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణభారతి నగర్ 13వలైనులో గంజాయి, లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని, గంజాయి తాగుతున్న 9 మందిని నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. నిందితులు గంజాయి, మద్యం వ్యసనాలకు అలవాటు పడి వాటికి అవసరమైన డబ్బు కోసం విశాఖపరిధిలోని లంబసింగి వెళ్లి గంజాయి, లిక్విడ్ గంజాయి తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తూ డబ్బు సంపాదిస్తున్నారు. నిఘావర్గాల సమాచారం మేరకు నల్లపాడు పోలీసులు స్వర్ణభారతి నగర్ 21వలైనుకు చెందిన షేక్ అబ్దుల్ రహమాన్ అలియాస్ అబ్దుల్, పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంకు చెందిన ఎస్‌వీఎస్ కాలనీ, 4వ లైన్‌లో ఉంటున్న చెన్నుపాటి లోకేష్ సాయి, , స్వర్ణ భారతి నగర్ 12వ లైన్‌కు చెందిన మలకతాళ్ల సాయి, శ్రీనగర్, 1వ లైన్‌కు చెందిన పోలూరి దేవరాజు ఆనంద, స్వర్ణభారతినగర్‌నగర్ 13వ లైనుకు చెందిన చిలుముల కరిష్మా తదితరులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

అదేవిధంగా గంజాయి తాగుతున్న షేక్ ముజీబ్, షేక్ అహమ్మద్, షేక్ రోషన్, షేక్ సైదా అలియాస్ కాళ్ళు, నల్లమేకల సత్యసాయి, గంతాల విజయ్ కుమార్, షేక్ అబ్బాద్, మంజు మనోహర, ఉల్లంగుల సుభాష్‌ను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. వారి నుంచి 2750 గ్రాముల గంజాయి, 37 ప్లాస్టిక్ డబ్బాల లిక్విడ్ గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసిన ఎస్సై పి.జనార్దనరావు, హెడ్ కానిస్టేబుల్ కె.సుబ్బారావు, కానిస్టేబుళ్లు మస్తాన్‌వలి, సాంబశివరావు, భిక్షనాయక్, శ్రావణ సంధ్య తదితరులను డీఎస్పీ మల్లికార్జునరావు అభినందించారు.

48,735 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 50,416 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,735 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 30,355 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	14500	334	9000	15500
నెంబరు. 5	8000	13000	నెంబరు. 5	11000	16000
273	9000	12700	273	10500	12500
341	8000	15500	341	8000	16000
4884	--	--	4884	9700	15000
సూపర్ 10	-	-	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	17300	తేజ	8500	17000
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8500	13500
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	9500	13000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

దళితుడి పంటను దున్నేసిన వైసీపీ నేత

అమరావతి, నవంబరు 13: మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామంలో ఓ పేద ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌలు రైతు సాగు చేసిన పత్తి పంటను ట్రాక్టర్‌తో వైసీపీ నాయకుడు దున్నేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉంగుటూరు గ్రామానికి చెందిన దార్ల వరబాబు రెండున్నర ఎకరాల భూమిని పెదపరిమి గ్రామానికి చెందిన రైతుల వద్ద కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. ఉంగుటూరు గ్రామానికి చెందిన వైసీపీ నేత పి.శేషయ్య కౌలు రైతు వరబాబును గత కొద్ది రోజులుగా బెదిరిస్తూ నా పొలంలో నీవు ఎందుకు పంట వేశావని కులం పేరుతో దూషించాడు. వరబాబు సాగు చేసిన పత్తి పంటను నాలుగు రోజుల క్రితం ట్రాక్టర్‌తో దున్ని నేలమట్టం చేశాడు. దీనిపై బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌హెచ్‌వో ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్లలో సభ్యులుగా పలువురు జిల్లా వాసులు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కార్పొరేషన్ సభ్యులను నియమించింది. రజక కార్పొరేషన్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నేత ఆర్.నాగేశ్వరరావు, నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ నేత జి.రామకృష్ణలను, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్లో పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎం.గంగారావు, మంగళగిరి నియోజకవర్గ టీడీపీ నేత ఎం.శివ శేషగిరిరావు, తెనాలి నియోజకవర్గ జనసేన నేత రఘురామయ్యలను సభ్యులుగా నియమించారు.

18న మాన్యువల్ కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో ప్రవేశాలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ఈ నెల 18వ తేదీన జరుగుతుందని యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

విద్యుత్ రంగాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

● తెలుగునాడు విద్యుత్ కార్మిక రీజనల్ కార్యదర్శి ఎన్ఎస్ఆర్‌కే ప్రసాద్

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ అనుబంధ విభాగం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రీజనల్ కార్యదర్శి నార్నె శివరామకృష్ణ ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం చేపట్టిన సభ్యత్వ నమోదులో 100 మందికి పైగా ఉద్యోగులు సభ్యత్వం తీసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలుగునాడు యూనియన్‌పై నమ్మకంతోనే భారీగా చేరికలు పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఆఫీస్ యూనిట్ అధ్యక్షుడు కొత్తపల్లి ఉమామహేశ్వరావు, కార్యదర్శి రాయపాటి సీతారామయ్య గుంటూరు టౌన్ అధ్యక్షుడు రాజేంద్ర, అనిత, గౌస్, ప్రసన్న, శివ జయలక్ష్మి ఉన్నారు.



యూనియన్‌లో చేరిన ఉద్యోగులతో నార్నె ప్రసాద్, ఉమామహేశ్వరరావు తదితరులు

'వైసీపీకి రాజకీయ సమాధి'

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల కాలంలో పీడ కల లాంటి పాలన అందించిన వైసీపీకి ప్రజలు రాజకీయ సమాధి కట్టారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి విమర్శించారు. వైసీపీ సోషల్ మీడియా సైకోలకు, వంత పాడుతున్న ఆ పార్టీ విషసర్పాలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ బుధవారం స్థానిక జిన్నాటవర్ సెంటర్‌లోని మహాత్మ గాంధీ విగ్రహానికి హరి నేతృత్వంలో జనసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆళ్ల హరి మాట్లాడుతూ తమ సోషల్ మీడియా కార్యకర్తలను ప్రభుత్వం అరెస్ట్ చేస్తోందటూ ఆ పార్టీ నాయకులు గుండెలు బాదుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అరాచక శక్తులు లేని ఆంధ్రప్రదేశ్ స్థాపనకు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జనసేన నేతలు ఎం రామారావు, మెహబూబ్ బాషా, అరుణ, ధరణి, సరోజిని, డీ వెంకటేశ్వరరావు, ఎం నాగరాజు, ఎం శేఖర్, బీ రాధాకృష్ణ, కే అంజి, నాజర్‌వలి, జీ రోశయ్య, కేశవ పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహం దగ్గర జనసేన నేతల నిరసన

'పొలం పిలుస్తుంది'

గుంటూరు(తూర్పు), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని లాం, వ్యవసాయ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త(కీటక విభాగం) డాక్టర్ దయానా అన్నారు. గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డలో మండల వ్యవసాయ అధికారి ఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం జరిగింది.



డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి దేవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తుర్లపాటి రాజేశ్వరికి 'ఆచార్య గంగప్ప పురస్కారం' ప్రదానం

గుంటూరు(తూర్పు), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శతాధిక గ్రంథకర్తగా, పరిశోధకుడిగా, మార్గదర్శకుడుగా ప్రఖ్యాతిగాంచిన ఆచార్య గంగప్ప రాష్ట్రం గర్వించదగ్గ గొప్ప సాహిత్య కృషీవలుడని కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ నారాయణ కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళా వేదికపై బుధవారం 'ఆచార్య గంగప్ప 28వ సాహితీ పురస్కారం-2024'ను ప్రముఖ సాహిత్య వేత్త, అనువాద రచయిత డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి దేవికి అందజేశారు. ఆమెను ఘనంగా సత్కరించి నగదు పురస్కారం అందజేశారు. సభకు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు మస్తానయ్య, ఆచార్య జీవి చలం, డాక్టర్ జీ సాంబశివ రావు, డాక్టర్ వీ సింగరావు, డాక్టర్ జే సీతారామారావు, అరసం జాతీయ అధ్యక్షులు పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

గాన కోకిల సుశీల పాటలు అజరామరం

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ గాయని, గానకోకిల సుశీల పాటలు అజరామరమైనవని ప్రముఖ గాయని యార్లగడ్డ లక్ష్మి ప్రశంసించారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుదవారం గాయని పీ సుశీల జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, బిక్కా అశోక్, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

డేటా చౌర్యం కేసులో టెక్నీషియన్ శేషు అరెస్ట్

గుంటూరు నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్‌లో ఇటీవల జరిగిన డేటా చౌర్యం కేసులో నిందితుడు టెక్నీ షియన్ భృగుబండ శేష్‌కుమార్ అలియాస్ శేషును బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీస్ కస్టడీకి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించిన విషయం విదితమే. ఆ సమయంలో పోలీస్‌స్టేషన్‌లో రికార్డ్ అయిన సీసీటీవీ ఫుటేజ్ దృశ్యాలు బయటకు లీక్ అయ్యాయి. దీనిపై అరండల్‌పేట ఎస్ఐ రోజాలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డేటా చౌర్యానికి పాల్పడింది శేషు కుమార్‌గా పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అతన్ని అరండల్ పేట పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు.

చుక్క మురుగునీరు పారదు !

● మిర్చియార్డు రోడ్డులో అస్తవ్యస్త డ్రైనేజీ

గుంటూరు విద్య, ఏటీ అగ్రహారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు, దాని పక్కనే ఉన్న కాలనీల్లో పడిన వర్షపునీరు బయటకు వెళ్లేందుకు లక్షలు వెచ్చించి నిర్మించిన డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా మారింది. స్థానిక 25వ డివిజన్ పరిధిలోని మిర్చియార్డు రోడ్డులోని తిరుపతమ్మతల్లి గుడి రోడ్డు నుంచి నర్సారావు పేటరోడ్డులోని హిందూ శ్మశానవాటిక వరకు రూ. 35 లక్షలకు పైగా మిర్చియార్డు నిధులతో రోడ్డు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాల్వలు నిర్మించారు. యార్డులో నుంచి వచ్చే వర్షపు నీరు, సమీప కాలనీల్లోని వర్షపునీరు ప్రవహించేందుకు వీలుగా వీటిని నిర్మించారు. అయితే, నిబంధనలు పాటించకుండా నిర్మించడంతో పాటు నిర్వహణ గాలికి వదిలివేయడంతో డ్రెయిన్లు పూడిపోయాయి. దీనికి తోడు, ఇక్కడ సమీపంలోని ప్లాస్టిక్ వ్యర్థాల గోదాములు, షెడ్లలో నుంచి తెచ్చిన మిర్చి తొడాలను కాల్వల్లో పడేస్తున్నారు పూడిక పేరుకుపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని సాయినగర్ కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన డ్రెయిన్లలో పూడికి తీయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



తిరుపతమ్మతల్లి గుడి రోడ్డులోని కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

హజ్ యాత్రికుల సమస్యలు పరిష్కరించండి

● అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే నసీర్



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికుల సమస్యలను ప్రభుత్వం చొరవ తీసుకొని పరిష్కరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. రెండో రోజు శాసనసభ సమావేశాల్లో హజ్ యాత్రికుల సమస్యలను ఆయన చర్చకు తెచ్చారు. రాష్ట్రం నుంచి ప్రతి ఏటా 3,900 మంది హజ్ హజ్ యాత్రకు వెళ్తున్నారని, వారికి తగిన సౌకర్యాలు అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం కడపలో హజ్ హౌస్ నిర్మాణానికి ప్రతిపాదించిందని, గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు బయలుదేరే వారి సంఖ్య కూడా అధికంగా ఉందని, అందువల్ల గన్నవరంలో కూడా హజ్ హౌస్ నిర్మించాలని కోరారు. గన్నవరం నుంచి నేరుగా హజ్ యాత్రకు వెళ్లేందుకు విమానాలు లేక యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. గన్నవరం నుంచి నేరుగా హజ్ యాత్రకు వెళ్లేందుకు వీలుగా విమాన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గత ప్రభుత్వంలో హజ్ యాత్రకు ప్రకటించిన సబ్సిడీ ఇప్పటి వరకు చెల్లించలేదని, కూటమి ప్రభుత్వం ఆ సబ్సిడీని జమ చేసేలా చూడాలని ముఖ్యమంత్రిని ఆయన కోరారు.

అపర సంజీవని సీఎం సహాయనిధి: ఎమ్మెల్యే మాధవి

● ఎమ్మెల్యే కృషితో చిన్నారి వైద్యానికి రూ. 10 లక్షల మంజూరు



సీఎం సహాయనిధి లేఖను చిన్నారి తండ్రికి అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): అనారోగ్యం పాలై వైద్యం చేయించుకోలేని నిరుపేదల పాలిట ముఖ్యమంత్రి సహాయ నిధి అపర సంజీవనిలా పనిచేస్తోందని, వారి ప్రాణాలను నిలుపుతోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న 44వ డివి జన్‌కు చెందిన చిన్నారి వైరాలా నవీన్ (7)కు ఆమె చొరవతో బుధవారం పది లక్షల రూపాయల సీఎం సహాయనిధి అందింది. ఆర్థిక కష్టాలతో వైద్యం చేయించుకోలేక బిడ్డను కోల్పోయే పరిస్థితి రావడంతో తమ బిడ్డను కాపాడాలని తండ్రి వైరాలా కోటేశ్వరరావు ఎమ్మెల్యేని అభ్యర్థించారు. దీనిపై వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించి ఇందుకు సంబంధించిన ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను చిన్నారి తండ్రికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లా డుతూ పేదల వైద్యానికి మరింత సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా వుంటానని చెప్పారు.

● హైకోర్టు వ్యాఖ్యలు వైసీపీ నేతలకు చెంపపెట్టు

సోషల్ మీడియాలో 'అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేముందని' ఏపీ హైకోర్టు వ్యాఖ్యానించడం వైసీపీ నేతలకు చెంపపెట్టులాంటిదని ఎమ్మెల్యే మాధవి అన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం బుధవారం ఆమె గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాడు అధికారంలో ఉన్నాం కదా అని వైసీపీ నేతలు ఇష్టానుసారంగా రెచ్చిపోయి మహిళల పై సభ్యసమాజం తలదించుకొనేలా పోస్టులు పెట్టారని అన్నారు. అధికారం పోయాక కూడా మహిళా మంత్రులు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కుటుంబసభ్యులపై నీచంగా, మార్ఫింగ్ పోస్టులు పెట్టిన వారిని చట్టప్రకారం అరెస్టు చేస్తే, ఆ పార్టీకి చెందిన నేతలు గుంటూరు జిల్లా జైలు వద్దకు వెళ్లి వారిని పరామర్శించడం చూస్తుంటే మహిళలపై వైసీపీకి ఏపాటి గౌరవం ఉందో తెలుస్తోందని విమర్శించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు డీఈవో అభినందన



ఉపాధ్యాయులను అభినందిస్తున్న డీఈవో రేణుక


గుంటూరు(విద్య),నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను డీఈవో సీవీ రేణుక బుధవారం అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు అహ్మదున్నీసా, ఆర్ నాగమణి,షేక్ రిజ్వానా బేగం తదితరులు డీఈవోను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఖుద్దూస్, ఉర్దూ డీఐ, ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌కెఎండి కాసిం, మైనార్టీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఇషాక్,జిలాని పాల్గొన్నారు.

అధ్యాపకురాలు సౌజన్యకు సన్మానం

గుంటూరు(విద్య),నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల అధ్యాపకురాలికి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం తమ కళాశాలకే గర్వకారణమని ప్రిన్సిపల్ గర్నేపూడి సునీత అన్నారు. ప్రభుత్వం నుంచి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు బి సౌజన్యను బుధవారం స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సత్కరించారు. సునీత మాట్లాడుతూ విద్యార్థినులకు మెరుగైన బోధన అందిస్తూనే ఇంటర్‌మీడియట్ పుస్త కాల రూపకల్పనలో ఆమె భాగ స్వామిగా ఉన్నారని తెలిపారు. ఆమె సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు.

జూనియర్ కళాశాలల్లో అపార్ నమోదు పూర్తిచేయాలి

● ఇంటర్ బోర్డు ఆర్ఐఓ జుబేర్



మాట్లాడుతున్న ఆర్ఐఓ జుబేర్

గుంటూరు(విద్య),నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల వివరాలు (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అపార్‌లో నమోదు చేసే ప్రక్రియ సత్వరం పూర్తి చేయాలని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ జుబేర్ ఆదేశించారు. అపార్ నమోదుపై జిల్లాలోని జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో బు ధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అపార్ నమోదులో సాంకేతిక సమస్యలు ఉంటే ఆధార్ కేంద్రాల్లో సరిచేసుకోవాలని సూచించారు. విద్యార్థుల వివరాలు స్పష్టంగా ఉంటే అపార్ నమోదు ప్రక్రియ వేగవంతమౌతుందన్నారు. చిన్న సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమం పూర్తి చేయాలని చెప్పారు.



జే సీ భార్గవ తేజకు వినతిపత్రం అందజేస్తున్న '108' ఉద్యోగులు

'108' ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించండి

● ఉన్నతాధికారులకు వినతి

గుంటూరు(తూర్పు), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): '108'లో పనిచేస్తున్న ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని '108' యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివ శంకర్, బాబులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జే సీ భార్గవ్ తేజ, డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి, డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చిరంజీవులకు వినతిపత్రాలను అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ '108' సేవలను నేరుగా ప్రభుత్వ నిర్వహించాలని కోరారు. ఉద్యోగ భద్రత తోపాటు, వాహనాల ఇన్సూరెన్స్, ఇతర సౌకర్యాలు కల్పన కోసం చర్యలు తీసుకోవాలని, 12 గంటల పనిని రద్దు చేసి ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఈ నెల 25 తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఆరే రామకృష్ణ, హసన్ కమల్, యెహోషువ, హసన్, మురళి, హేమంత్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ రుణాల మంజూరులో జాప్యం తగదు

● జడ్పీ సీఈవోకు ఏపీటీఎఫ్ నాయకుల ఫిర్యాదు



జడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య),నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పీఎఫ్ లోన్లు మంజూరు కోసం దరఖాస్తు చేసిన ఉపాధ్యాయులను వేధిస్తున్నారని, రూ. 5 లక్షల పైన లోను ఉంటే మెడికల్ సర్టిఫికెట్ తేవాలని కొత్త నిబంధనలు పెడుతున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే బసవలింగారావు ఆందోళన వ్యక్తం చేశారు. లేని నిబంధనలు పెట్టి డిప్యూటీ సీఈవో పేరుతో సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు జడ్పీ సీఈవో జ్యోతిబసుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పీఎఫ్ నిబంధనల ప్రకారం రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్ వైద్యుని సర్టిఫికెట్ సరిపోతుందని, కేవలం జడ్పీలో కొంత మంది డబ్బుల కోసం ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. పీఎఫ్ నెలవారీ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కావడం లేదని, సాంకేతిక కారణాలు చూపి జాప్యం చేస్తున్నారని తెలిపారు. వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని సంఘం కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, ఎస్ఎస్ఎన్ మూర్తి,కేసనరమేష్, దాస్, చుక్కా. వెంకటేశ్వర్లు, బాలరాజు, శివరామకృష్ణ,శ్రీనివాసరావు,సుబ్బారావు,గురుమూర్తి స్పష్టం చేశారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తానని సీఈవో వారికి హామీ ఇచ్చారు.

23 నుంచి గ్రామీణ ఆటల పోటీలు

గుంటూరు(తూర్పు), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 లలో గ్రామీణ ఆటల పోటీలు కొల్లిపర గ్రామంలో జరగనున్నాయి. ఈ విషయాన్ని ఈశా ఫౌండేషన్ వలంటీర్లు స్వామి దక్షారి, కందుల సుధాకరరావు తెలిపారు. కొల్లిపరలోని అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) వీ నరసింహారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ పురుషుల విభాగంలో వాలీబాల్, మహిళల విభాగంలో త్రోబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 28 వరకు క్లస్టర్, డివిజన్ మ్యాచ్‌లు జరుగుతాయని వివరించారు. డిసెంబరు 28న కోయంబత్తూరులో ఫైనల్ మ్యాచ్ నిర్వహించి వాలీబాల్, త్రోబాల్ విజేతలకు రూ.5లక్షల నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 79814 27364 నంబరులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఈశా వలంటీరు వీ ప్రదీప్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్‌డీవో నరసింహారెడ్డి, పాల్గొన్న ఈశా ఫౌండేషన్ వలంటీర్లు

ఉద్యోగులు ప్రైవేటు క్రిమినల్ కేసుల వల్ల సస్పెండ్ అయితే....

● ఈదర వీరయ్య

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వ్యక్తిగత సివిల్ క్రిమినల్ కేసుల వల్ల సస్పెండ్ అయిన ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసే విధానంపై రాష్ట్ర పెన్షన్ దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయానికి బయట ప్రభుత్వ ఉద్యోగి ప్రైవేటు క్రిమినల్, సివిల్ కేసులలో ఇరుక్కొని సస్పెండై ఆ తరువాత విధి నిర్వహణకు పునర్నియామకం పొందిన ఉద్యోగి సస్పెన్షన్ కాలాన్ని అంశాల వారీగా క్రమబద్ధీకరించారు. సస్పెన్షన్ అయిన తేదీ నుంచి తిరిగి కార్యాలయంలో చేరిన తేదీ వరకు ఉన్న కాలాన్ని నాన్ డ్యూటీగా పరిగణిస్తారన్నారు. కార్యాలయానికి సం బంధం లేని వ్యక్తిగత కారాణల వల్ల సస్పెండ్ అయ్యాడు కనుక ఈ విషయంలో ప్రభుత్వానికి ఏమాత్రం సంబంధం లేదన్నారు. అందువల్ల సస్పెన్షన్ కాలాన్ని నో వర్క్, నో పే అనే సూత్రాన్ని అనుసరించి అతనికి ఎలాంటి జీతభత్యాలు చెల్లించనవసరం లేదన్నారు. ఒక వేళ అతను కోర్టు కేసుల్లో నిరపరాధి అని తేలినప్పటికీ అతనికి జీతభత్యాలు రావన్నారు. కానీ అతనికి ఏమైనా జీవనభృతి చెల్లించి ఉంటే అట్టి మొత్తాన్ని రికవరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఇక సస్పెన్షన్ కావాలన్ని క్రమబద్ధీకరణ విషయానికి వస్తే సస్పెన్షన్ పూర్తి న్యాయ సమ్మతమనే నిర్ణయించి నప్పుడు సస్పెన్షన్ కాలాన్ని నాన్‌డ్యూటీగా పరిగణించాలన్నారు. అతని జీత భత్యంలు జీవనభృతికి కుదించాలని, కానీ ఒక వేళ ఉద్యోగి సస్పెన్షన్ కాలాన్ని అర్హత గల సెలవుల కింద మార్చమని కోరితే అలాంటి సెలవులు మంజూరు చేయ వచ్చన్నారు. సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగి శాఖాపరమైన లేక కోర్టు కేసుల విషయమై క్రమశిక్షణా చర్యలు పూర్తికాక ముందే చనిపోతే సస్పెండ్ అయిన తేదీ నుంచి చనిపోయిన తేదీ వరకు గల కాలాన్ని డ్యూటీగా అన్ని విషయాలకు పరిగణించా లన్నారు. అతని కుటుంబ సభ్యులకు అతను సస్పెండ్ కాకుండా ఉంటే వచ్చే జీతభత్యాలను చెల్లించాలని వీరయ్య తెలిపారు.

గుజ్జనగుండ్లలో వ్యక్తి దారుణ హత్య



ఘటనాస్థలిలో రక్తపు మడుగులో గౌస్ మృతదేహం

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుజ్జనగుండ్ల సెంటర్‌లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత షేక్ గౌస్ (54)ని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. శేషయ్య ఆసుపత్రి పక్క రోడ్డులోని జేకేసీ నగర్ ఒకటో లైన్ లో ని శ్రీనివాసటెంట్‌హౌస్ ఫుట్‌పాత్‌పై పడుకున్న గౌస్ ను గుర్తు తెలియని వ్యక్తులు బలమైన ఆయుధంతో తలపై కొట్టి హత మార్చారు. అతని వద్ద ఉన్న డబ్బులు కోసమే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చని అను మానిస్తున్నారు. సమాచారం అందుకున్న పట్టాభిపురం ఎస్ఐ నరహరి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేక రించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు, గుజ్జనగుండ్ల నాలుగో లైన్ కు చెందిన షేక్ గౌస్ కు భార్య షేక్ ముంతాజ్, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గతంలో టెంట్ హౌస్ లో గౌస్ పని చేసి జీవనం సాగించేవాడు. అయితే, మద్యానికి అలవాటు పడిన గౌస్‌కు కూలి డబ్బులు సరిపోకపోవడంతో రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డి పాలెంలో ఉంటున్న పెద్ద కూతురు నాగూర్‌బీ వద్దకు వెళ్లాడు. నరస రావుపేటలో ఉంటున్న చిన్న కుమార్తె ఫాతిమా వద్ద తల్లి ఉంటోంది. కుమారుడు నాగూర్ కూడా నరసరావుపేటలోనే ఉంటున్నాడు. అయితే, గౌస్ మద్యం తాగి ఇంట్లో గొడవ చేస్తున్న క్రమంలో ఇంట్లో వారితో గొడవపడి రెండు నెలల క్రితం గుంటూరు వచ్చాడు. జేకేసీ నగర్ ఒకటో లైన్‌లోని టెంట్‌హౌస్ శ్రీనివాస సప్లయర్స్ నిర్వాహకుడు శ్రీనివాసరావుకు గౌస్ కొంత మొత్తం డబ్బు వడ్డీకి ఇచ్చాడు. ఆయన వద్ద వడ్డీ డబ్బులు తీసుకోవడమే గాక కూలి పనులకు వెళుతూ వచ్చిన డబ్బులతో మద్యం తాగి అక్కడే ఫుట్‌పాత్ పై పడుకుంటున్నాడు. మంగళవారం రాత్రి సుమారు తొమ్మిదిన్నర గంటల సమయంలో టెంట్ హౌస్ శ్రీనివాసరావు షాపు మూసి వేసి ఇంటికి వెళ్లే సమయంలో అక్కడే మద్యం తాగుతూ గౌస్ కనిపించాడు. తెల్లవారిన తర్వాత చూడగా గౌస్ రక్తపుమడుగులో చని పోయి ఉన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు బలమైన ఆయుధంతో ఆయన తలపై కొట్టి హత మార్చారు. అయితే, గౌస్ వద్ద డబ్బులు ఉన్న విషయం తెలుసుకున్న వారే ఆ డబ్బు కోసం హత్య చేసి ఉండవచ్చని అను మానిస్తున్నారు. గౌస్ హత్యకు గురైన వార్త తెలుసుకున్న ఆయన భార్యాపిల్లలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త పేరుకుంది.. దుర్వాసన వెదజల్లుతోంది





అమరావతి రోడ్డులోని అన్నపూర్ణనగర్ మూడో లైన్‌లో..

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి). నగరంలోని అమరావతి రోడ్డులో ఉన్న అన్నపూర్ణనగర్ మూడో లైన్‌లో చెత్త పేరుకుపోయింది. గత నాలుగు రోజులుగా స్థానికులంతా చెత్తాచెదారాన్ని ప్లాస్టిక్ కవర్లలో పెట్టి ఇక్కడ పడేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది తక్షణమే చెత్తను తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రపరచాలని స్థానికులు కోరుకుంటున్నారు.

హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ రెండు రోజుల్లో పూర్తి చేయాలి: జీఎంసీ కమిషనర్



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) గుంటూరు నగరంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ గురువారానికి, ఎన్‌పీసీఐ అప్‌లోడ్ శుక్రవారానికి పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో బుధవారం నోడల్ అధికారులతో సమావేశం నిర్వ హించి, జియో ట్యాగ్, ఎన్‌పీసీఐ అప్‌పై సమీక్షించారు. కమిషనర్ మాట్లా డుతూ వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ మ్యాపింగ్‌ని గురువారం సాయంత్రానికి పూర్తి చేసేలా నోడల్ అధికారులు సచివా లయాల వారీగా పర్యవేక్షించాలని ఆదేశించారు. బ్యాంక్ అకౌంట్స్ పై చేపడుతున్న ఎన్‌పీసీఐ అప్‌లోడ్ శుక్రవారానికి పూర్తి చేయాలన్నారు. నోడల్ అధికారులు కూడా ఆయా యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని, క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డీఎల్డీఓ పిచ్చిరెడ్డి, ఉపా సెల్ పీఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

బుడంపాడు పొలాల్లోకి నీరు వెళ్లకుండా ప్రతిపాదనలు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పీకల వాగులో పూడిక లేకుండా, వర్షా కాలం వాగు పొంగి బుడంపాడు పొలాల్లోకి నీరు వెళ్లకుండా తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీఎంసీ కమిషనర్ పులిశ్రీనివాసులు ఇంజనీరింగ్ అధి కారులను ఆదేశించారు. పీకల వాగుని జాతీయ రహదారి వెంబడి, బుడంపాడు రైతుల పొలాల వైపు నుండి ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. బుడంపాడు వద్ద పీకల వాగు పొంగి పొలాల్లోకి నీరు వస్తుందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు వాగు పొంగ కుండా ప్రహరీ నిర్మాణం, పూడికతీతలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఈని ఆదేశించారు. బుడంపాడులో తాగునీటి సరఫరా వాల్వ్ పిట్లు అశుభ్రంగా ఉండడం, డ్రెయిన్ పొంగి నీరు పిట్‌లో కలవడం చూసి సదరు వాల్ ఆపరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో పిట్‌లు షిఫ్ట్ చేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి పనులను ఎందుకు పెండింగ్‌లో ఉంచుతారని ఇంజనీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. బుడంపాడులోని శ్మశానానికి కాంపౌండ్ వాల్, ఫ్లాట్ ఫారం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని ఆదేశించారు. అనంతరం జీటీ రోడ్డులో చేపట్టిన ప్యాచ్ వర్క్ లను పరిశీలించారు.

వచ్చే నెలాఖరుకు ఇళ్ల నిర్మాణం పూర్తవ్వాలి

గుంటూరు నగరపాలక సంస్థ హౌసింగ్ లే అవుట్లలో డిసెంబరు చివరి నాటికి పెండింగ్ ఇళ్ల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన ఏటుకూరు 5 లేఅవుట్లలో హౌసింగ్ పీడీ, ఇంజనీరింగ్, హౌసింగ్ విభాగం అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో ఇళ్ళ నిర్మాణ పనుల పురోగతిపై లే అవుట్‌లోనే బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏటుకూరు 5 లే అవుట్స్‌లో 9700 మంది లబ్ధిదారులు ఉంటే వారిలో సుమారు 4,200 ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యాయని, మిగిలిన వాటిలో ఎక్కువ శాతం డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఓటర్ క్లెయిమ్స్‌ని బీఎల్‌వోలు పారదర్శకంగా పరిశీలించి గురువారం సాయంత్రానికి వాటిని పూర్తి చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

పోసాని కృష్ణ మురళిపై గుంటూరులో కేసు

గుంటూరు, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకుడు, సినీ నటుడు పోసాని కృష్ణ మురళిపై స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా ఇటీవల టీవీ 5 ఎండీ బీఆర్ నాయుడు బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే. దీనిపై పోసాని కృష్ణ మురళి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ పదవిని అదేవిధంగా చైర్మన్ బీఆర్ నాయుడుని అవమానించేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు దియ్యా రామకృష్ణ ప్రసాద్ బుధవారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ వ్యాఖ్యల కారణంగా కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మరోసారి ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండేందుకుగాను ఆయనపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకోలను సామాజిక కార్యకర్తలంటారా?: కనపర్తి



మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): తల్లికీ, చెల్లికీ తేడా లేకుండా నీచాతి నీచంగా పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా సైకోలు సజ్జల భార్గవరెడ్డి, వర్రా రవీందర్ రెడ్డి, బోరుగడ్డ అనిల్, ఇంటూరి రవి కిరణ్, శ్రీరెడ్డి తదితర సంఘ విద్రోహ శక్తులను గోబెల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబటి రాంబాబు 'సామాజిక కార్యకర్తలని' మాట్లాడటం సిగ్గు చేటని కనపర్తి శ్రీనివాసరావు విమర్శిం చారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రశ్నించి మర ణించిన డాక్టర్ సుధాకర్, కుండబద్దలు సుబ్బారావు, పాలకుల అవినీతి, అరా చకాలను ఎండగట్టిన సీనియర్ జర్నలిస్ట్ అంకబాబు, డాక్టర్ పీవీ రమేశ్‌లను సామాజిక కార్యకర్తలంటారన్న కనీస పరిజ్ఞానం కూడా అంబటికి లేకపోవడం దురదృష్టకరమన్నారు. వైఎస్ విజయమ్మ, షర్మిలపై అతి జుగుప్సాకరంగా పోస్టులు పెట్టిన వైఎస్ భారతీరెడ్డి పీఏ రవీందర్‌రెడ్డిని వైసీపీ నేతలు సమర్థిస్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో మాదిరిగా అడ్డగోలు పోస్టులు పెడుతూ వ్యక్తిత్వ హననానికి పాల్పడ తామంటే కుదరదని వైసీపీ నేతలను హెచ్చరించారు. రఘు రామకృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసు అధికారులు, అందుకు సహకరించిన ప్రభుత్వ వైద్యులు జైలుకెళ్ళక తప్పదని అన్నారు. గత అసెంబ్లీలో చంద్ర బాబు, అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, మండలిలో చైర్మన్ షరీఫ్, సభ్యులపై లోకే శ్‌లపై దాడికి యత్నించి, బూతులు తిట్టిన వైసీపీ సైకోల ప్రసంగాలను స్పీకర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల కొండ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నేత బొల్లెద్దుల సుశీలరావులు పాల్గొన్నారు.

అనుబంధాలు

ఆవిరి



బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

● చిన్నారుల్లో కనిపిస్తున్న మానసిక రుగ్మత ● అమ్మ, నాన్నల పూర్తిపేరు కూడా చెప్పలేకపోతున్న వైనం ● తాత్కాలిక ఆనందాలకు అలవాటుపడుతున్న పిల్లలు ● నిర్ధారిస్తున్న సర్వేలు, మానసిక నిపుణులు ● చిన్నారుల మెదడుపై ప్రభావం చూపుతున్న సెల్‌పోన్లు ● పెద్దవాళ్లకు దూరంగా ఉండటం కూడా మరో కారణం

సాంకేతిక యుగంలో మన పిల్లలకు అన్ని నేర్పుతున్నామన్న భావన నేటి తరం తల్లిదండ్రుల్లో ఉంది. వేగంగా వృద్ధి చెందుతున్న ఆధునిక సమాజానికి అనుగుణంగా తమ పిల్లలను మరల్చుతున్నామని గట్టిగా నమ్ముతున్నారు. కానీ ఎప్పుడైన వారి ఎదురుగా కూర్చుని బంధాలు గురించి చెప్పారా.. కనీసం మీ పేర్లు అయిన వారికి తెలుసో లేదో గమనించారా.. రక్తసంబంధీకుల గురించి తెలుసో లేదో కనుక్కున్నారా.. అంటే ప్రతి తల్లితండ్రి ఒక్కసారి ఆలోచనలో పడతారు. 12 సంవత్సరాలలోపు పిల్లలకు తమ తల్లి, తండ్రి పూర్తి పేరు కూడా తెలియదనే విషయాన్ని అనేక సర్వేలు నిర్ధారించాయి. సమాచారం, విజ్ఞాన అవసరాల కోసం మొబైల్ వాడకాన్ని అనుమతిస్తే, వ్యక్తిగత నియంత్రణ లోపించి ఎలా వినాశనానికి దారి తీస్తుందో ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే అర్థమవుతుంది.




75 శాతం మందికి తెలియదు

తల్లిదండ్రుల మధ్య అనుబంధాన్ని అంచనా వేయడానికి హైదరాబాదు విశ్వ విద్యాలయానికి చెందిన హెల్త్ టెక్నాలజీ వారు సర్వే నిర్వహించారు. ఈ సర్వే నివేదిక ప్రకారం.. అమ్మ, నాన్నను గుర్తు పడతారు కాని వారి పేర్లు తెలియని 4-7 మధ్య వయస్సు కలిగిన వారు, ఇతర బంధువులను కనీసం గుర్తించలేని వారు 62 శాతం, ముద్దు పేర్లుకు అలవాటుపడి వారి పేరు కూడా గుర్తులేని వారు 39 శాతం, పేర్లు తెలుసు కాని పూర్తి పేరు (ఇంటి పేరుతో సహా) తెలియని 7-12 మధ్య వయస్సు కలిగిన వారు 65 శాతం ఉన్నారు. 13- 18 మధ్య వయస్సు కలిగిన వారిలో తల్లి, తండ్రుల పుట్టినరోజు తెలియని వారు 62 శాతం, తండ్రి విద్యార్హత తెలియని వారు 63శాతం, తండ్రికి ఇష్టమైన ఆహారం ఏమిటో తెలియని వారు 60 శాతం, అమ్మ, నాన్న ఏ విషయాలకు సంతోషడ తారో తెలియని వారు 80 శాతం ఉన్నారు. యువతలో 23 శాతం మందికి తమ తల్లిదండ్రుల వృత్తి ఏమిటో కూడా తెలియదు.

గుంటూరు(తూర్పు), నవంబరు 13: అల్లరి చేసే పిల్లల చేతిలో ఫోన్లు, ట్యాబ్‌లు అందించి వారి అల్లరిని మాన్పించామని సంతోష పడతాం. కాని అదే పిల్లల పాలిట అశనిపాతంగా మారుతోంది. అటువంటి చిన్న తప్పిదాలు బంధాలను బలహీనం చేస్తున్నాయి. అది ఏస్థాయిలో అంటే తమ తల్లిదండ్రుల పేర్లు కూడా వారికి తెలియని పరిస్థితికి చేరుకుంటోంది. తల్లి దండ్రులు, పిల్లల మధ్య పెరుగుతున్న దూరానికి, అనాదిగా భారతీయ సంస్కృతికి మూలమైన కుటుంబ వ్యవస్థకు బీటలు పడుతున్నాయన్న చేదునిజాన్ని ప్రతిబింబిస్తోంది. ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం, పెద్దవారికి దూరంగా పిల్లలను ఉంచడమే ఈ దుస్థితికి కారణం అని చెప్పుకోవాలి.

నేర్పించే వారు లేకనే..

గణాంకాల మాట పక్కనబెడితే నవతరం పిల్లలు, తల్లిదండ్రుల మధ్య పెరుగుతున్న బాంధవ్యాలకు ప్రస్తుత పరిస్థితులు అడ్డం పడుతున్నాయి. ఉమ్మడి కుటుంబాల్లో ఉండే పిల్లల్లో ఇటువంటి పరిస్థితి లేదు. కేవలం చిన్న, చిన్న కుటుంబాలు, పెద్దవారికి దూరంగా ఉండే పిల్లల్లోనే ఈ పరిస్థితి కనబడుతుంది. తల్లిదండ్రులు సంపద సృష్టిలో పడిపోయి తమను పట్టించుకోరనే భావనలో ఉండిపోవడంతో వారి సమాచారంపై పిల్లలు ఆసక్తి చూపడం లేదు. సరిగ్గా ఇదే సమయంలో స్నేహితులు, అపరిచితులను ఆహ్వానించి తాత్కాలిక ఆనందాల కోసం అన్వేషిస్తూ ఉంటారు.



కాఠిన్యం వద్దు

కొంతమంది తల్లిండ్రులు తమ పిల్లలను దారిలో పెట్టాలని చాలా కఠినంగా వ్యవహరిస్తుంటారు. కాని ఇది హద్దు మీరితే బెడిసి కొడుతుందని, సృజనాత్మకతని దెబ్బతీస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరీ కాఠిన్యం మంచిది కాదని సూచిస్తున్నారు. నచ్చజెప్పడం, సాధారణ పద్ధతిలో భయం పెట్టడం వంటి చేయవచ్చు.



పెద్దలు లేకపోవడం మరో కారణం

చిన్ననాటి నుంచే అమ్మ, అత్త, తాత అనే పదాలను పిల్లలచేత పెద్దలు నేర్పుతూ ఉంటారు. ఆ వయస్సు నుంచే వారి జ్ఞాపకాల్లో బంధాలు అనే విత్తును నాటతారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. తమ జీవిత విశేషాలు, ప్రధాన ఘట్టాలు, ప్రాథమిక అంశాలు కూడా తల్లిదండ్రులు పిల్లలతో పంచుకోవడం లేదు. అలాగే భోజనసమాయాలు, పండుగలు, ఖాళీ సమయాలను గుణాత్మకంగా ఉపయోగించడంలో తల్లిదండ్రులు విఫలమవుతున్నారు. కుటుంబ నిర్ణయాల్లో పిల్లలను భాగస్వాములను చేస్తే వారికి బాధ్యతలు అలవాటుపడటమేగాక, తల్లిదండ్రులపై గౌరవం, ఇష్టం బలపడాతాయి.





చికాకు.. ఆందోళన..

జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దుకోవడానికి వేదిక కుటుంబవ్యవస్థ ఒక్కటే. అటువంటి ఆత్మీయ ఆనందాలు లేకుండా, ఒంటిరిగా ఉంటూ ఆకలి, ఇతర ఆవసరాలకు మాత్రమే స్పందిస్తే అది ఒక విధంగా మానసిక రుగ్మత లాంటిది. ఇలాంటి అలవాట్లు బారిన పడితే మాససిక వ్యాధుల బారిన పడతా రని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. పెద్దలకు దూరంగా ఉంటూ, ఎక్కువ చిరాకు. తమను తాము నిధించుకోవడం, ఇతరులు ఎదురుపడకుండా దాక్కోవడం, నిరంతరం తీవ్రమైన ఆందోళ నలో ఉండటం, గందరగోళ పరిస్థితుల్లో వంటి లక్షణాలు వీరిలో కనిపిస్తూ ఉంటాయి. ఒక దశ దాటిన తరువాత నిద్రాహారాలు మానివేయడం, దూకుడుగా ప్రవర్తించడం వంటివి చేస్తాయి. స్మార్ట్ ఫోనుకు బానిసవుతున్న పిల్లల్లో నైపుణ్యాలు తగ్గుతాయని మానసిక వైద్యులు చెబుతున్నారు. మిగిలిన వారితో పోల్చుకుంటే స్మార్ట్ ఫోన్‌కు బానిసలవుతున్న పిల్లలు అధికంగా కుంగబాటుకు గురవుతున్నారని హెచ్చరించారు.

● ఒకసారి అడిగి చూడండి

- అమ్మ, నాన్న పేర్లు, ముఖ్యమైన బంధువుల ఇంటి పేర్లతో చెప్పమనండి. వరసల అడగండి.
- పుట్టిన ఊరు. అక్కడ ఎవరెవరు ఉంటారు.
- బంధువుల్లో తమ వయస్సు ఉన్న పిల్లలు పేర్లు
- ఫోను నెంబరు,ఇతర సమాచారం చెప్పండి
- సోదరి, లేదా సోదరుడు ఏమి చదువుతున్నాడు, పూర్తి పేరు
- తల్లి దండ్రుల వృత్తి, పుట్టిన తేది, వారి జీవితంలో ముఖ్య ఘట్టాల తేదీలు

పై ప్రశ్నలకు సమాధానలు చెబితే పిల్లలకు చదువుతోపాటు, కుటుంబంపై ప్రాథమిక అవగాహన ఉన్నట్లుగా భావించండి. లేని పక్షంలో నేర్పే ప్రయత్నం చేయండని మానసిక వైద్యులు సూచిస్తున్నారు.

పెద్దవారే వైద్యులు

-డాక్టర్ వెంకటకిరణ్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్

ఇటువంటి సమస్యలకు పెద్దవారే వైద్యులు. అస్తిత్వాన్ని కోల్పోతున్న బాంధవ్యాలను కాపాడుకోవడం మన కర్తవ్యం. సంపద కోసం వెచ్చించడం మాని పిల్లల్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలి. లేని పక్షంలో ఇలాంటి చిన్న, చిన్న సమస్యలకు కూడా ఆస్పత్రుల అవసరం భవిష్యత్‌లో ఏర్పడుతుంది.



సమయాన్ని కేటాయించాలి

- వై అరుణకుమారి, హెడ్ నర్స్ జీజీహెచ్

పిల్లల కోసం తల్లిదండ్రులు సమయాన్ని కేటాయించి, వారి అనుభవాలను పంచుకోవాలి. డబ్బు ఉంటే అన్ని అవే వస్తాయి అని నేటితరం తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. చదువు తప్ప మరేది ముఖ్యం కాదు అనుకుంటున్నారు. తల్లిదండ్రుల ప్రేమను ఆస్వాదించే పిల్లలు బయట లభించే తాత్కాలిక సంతోషాలకు లొంగరు.



సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం: మన్నవ



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సుపరిపాలనను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమితుడైన మన్నవ మోహనకృష్ణ అన్నారు. టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబు, లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని టెక్నాలజీని ఉపయో గించి ప్రజాసేవ చేస్తానని వారికి మోహనకృష్ణ తెలియజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. నూతన సాంకేతికతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యువనేత నారా లోకేశ్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి కృషి చేస్తున్నారని, ఐటీశాఖ మంత్రిగా ఉన్న ఆయన రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల కోసం మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని, రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ ఛైర్మన్‌గా లోకేశ్ ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నారని, ఆయన కృషితో రాష్ట్రంలో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సిద్ధమైందని అన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఒప్పందం

యూకే సంస్థతో ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఎంవోయూ

గుంటూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయ విప్లవానికి పునాదులు వేసే దిశగా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అడుగులు వేస్తోంది. వ్యవసాయానికి తీవ్ర అడ్డంకిగా మారిన వాతావరణ సమస్యలను ముందే గుర్తించి, పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తున్న యూకేలోని సెంటర్ ఫర్ అగ్రికల్చర్, బయో సైన్స్ ఇంటర్నేషనల్ సంస్థతో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు సంస్థల మధ్య శిక్షణ, సామర్థ్యం



ఒప్పంద కార్యక్రమంలో వీసీ శారదా జయలక్ష్మి, రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్

పెంపు, సమాచార మార్పిడి, పంటల ఆరోగ్య సంరక్షణ సమాచారం వ్యాప్తి అంశాలపై ఒప్పందం కుదిరింది. నూతన ఒప్పందం నేపథ్యంలో సెంటర్ ఫర్ అగ్రికల్చర్, బయో సైన్స్ ఇంటర్నేషనల్ సంస్థలోని డిజిటల్ టూల్స్ విభాగం పంటలను కాపాడుకునేందుకు అవసరమైన సమాచారం వ్యవసాయ యూనివర్సిటీకి అందజేస్తుంది. ఒప్పంద పత్రాలను వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి దేవి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, సీఏబీఐ నుంచి సౌత్ ఆసియా రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్, గ్లోబల్ టీమ్ లీడర్ డాక్టర్ మాళవిక చౌదరి, కో ఆర్డినేటర్ మధుమంజరి, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివన్నారాయన, డాక్టర్ రమణ, డాక్టర్ మణి, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ పి.రవి, జాయింట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, యూనివర్సిటీ పీఆర్‌వో డాక్టర్ వి.విశాలాక్షి పాల్గొన్నారు.

అనుసంధానం

(5వ పేజీ తరువాయి)

ప్రదేశం కనిపిస్తుంది. తద్వారా వారికి అత్యవసర సహాయాన్ని అందించవచ్చు. వారిని సంరక్షించడానికి తగిన సలహాలు, సూచనలు చేయవచ్చు.

సమస్యల సత్వర పరిష్కారం

జియో ట్యాగింగ్ ద్వారా సమస్యలను సత్వరం పరిష్కరించవచ్చు. ఒక గ్రామంలో తలెత్తిన సమస్య గురించి ఒకరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే, ఆ సమస్య పరిష్కరించాలంటే ఆ వ్యక్తి ఫోన్ నెంబరు, నివసించే ప్రాంతం ఇతర వివరాలన్నీ అధికారులు నమోదు చేసుకుంటేగానీ ఆ ప్రాంతానికి వెళ్లి ఆ సమస్య పరిష్కారం చేయలేరు. దీనికోసం ఎంతో సమయం వృధా అవుతోంది. ఫిర్యాదులో ఇచ్చే మొబైల్/ఆధార్ నెంబర్ ఆధారంగా ఒక్క సెకనులో ఫిర్యాదుదారు అడ్రస్‌ను కనుగొనేందుకు ఈ పద్ధతిలో వీలు కలుగుతుంది. ఆధార్ నెంబర్ ఒకసారి నమోదు చేస్తే చాలు.. మొత్తం వివరాలు అధికారుల ముందుకు వచ్చేస్తాయి. ఆ వ్యక్తి ఉండే ప్రాంతాన్ని నేరుగా మ్యాపులోనే చూడవచ్చు. తద్వారా నేరుగా ఆ ప్రాంతానికి చెందిన అధికారులకు ఆ బాధ్యత అప్పగించి సత్వరమే సమస్యలు పరిష్కరించవచ్చు.

● ఒక్కో ఉద్యోగికి 160 ఇళ్ల బాధ్యత

ప్రభుత్వం చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ బాధ్యతను సచివాయల ఉద్యోగులకు అప్పగించింది. ఒక్కో ఉద్యోగి రెండు క్లస్టర్లలో హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఒక్కో ఉద్యోగి 100 నుంచి గరిష్ఠంగా 160 ఇళ్లను జియో ట్యాగింగ్ చేయనున్నారు. గత మంగళవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవగా గుంటూరుజిల్లాలో 7,32,187 ఇళ్లకుగానూ 1,20,151 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తయింది. ఇంకా 6,12,036 ఇళ్లకు జియో ట్యాగింగ్ చేయాల్సి వుంది. పల్నాడు జిల్లాలో 7,04,609 ఇళ్లకుగానూ 2,00,478 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తవగా, 5,04,131 ఇళ్లకు ట్యాగింగ్ చేయాల్సి వుంది. బాపట్ల జిల్లాలో 5,52,503 ఇళ్లకుగానూ 2,19,895 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తవగా, 3,32,608 ఇళ్లకు ట్యాగింగు చేయాల్సి వుంది.

బ్యాంకు లింకేజీపై స్పెషల్ డ్రైవ్

నేషనల్ పెన్షన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌పీసీఎల్) కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు లింకేజీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలు ఆధార్, మొబైల్ నెంబర్లతో అనుసంధానం అయ్యాయా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తోంది. బ్యాంకుకు ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానం కానివారి వివరాలను ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల లాగిన్లకు పంపించారు. ఇలా బ్యాంకు లింకేజీ చేయని వారి వివరాలు తెలుసుకుని, వారికి విషయాన్ని తెలియజేసి ఆధార్ లింక్ చేసుకోవాలని ప్రజలకు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుడికి అందించేలా డీబీటీ పద్ధతికి ప్రభుత్వం ప్రాధాన్యాన్ని పెంచింది.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే యాత్రీకుల రద్దీ దృష్ట్యా ఈ నెలలో నాలుగు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు. 07131 కాచీగూడ - కొట్టాయం ప్రత్యేక రైలు ఈ నెల 17, 24 తేదీలలో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల మీదగా మరుసటి రోజు సాయంత్రం 6.30 గంటలకు కొట్టాయం చేరుకొంటుంది. నెంబరు. 07132 కొట్టాయం - కాచీగూడ రైలు ఈ నెల 18, 25(సోమవారం) తేదీల్లో రాత్రి 8.50కి బయలుదేరి చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా బుధవారం వేకువజామునకు ముందు 1 గంటకు కాచీగూడ చేరుకొంటుంది. నెంబరు. 07137 హైదరాబాద్ - కొట్టాయం ప్రత్యేక రైలు ఈ నెల 15, 22, 29 తేదీల్లో (శుక్రవారం) మధ్యాహ్నం 12.05కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల మీదగా మరుసటి రోజు సాయంత్రం 6.45కి కొట్టాయం చేరుకొంటుంది. నెంబరు. 07138 కొట్టాయం - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 16, 23, 30 తేదీల్లో(శనివారం)c రాత్రి 9.45కి బయలుదేరి గుంటూరు మీదగా ఆదివారం అర్ధరాత్రి దాటాక 12.50కి సికింద్రాబాద్ చేరుకొంటుందన్నారు.

నేడు విశాఖపట్నం, రేపు గుంటూరు సింహాద్రి రైళ్ల రద్దు


విజయవాడ డివిజన్‌లో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా నెంబరు. 17239 గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 14వ తేదీన, నెంబరు. 17240 విశాఖపట్టణం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 15న రద్దు చేస్తున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు.

విక్రమ సింహపురి రైలుకి న్యూగుంటూరులో టిక్కెట్‌లు ఇవ్వాలి

ఈ నెలాఖరు వరకు విజయవాడ - గూడూరు విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్‌ని రైల్వే శాఖ న్యూగుంటూరు మీదగా దారి మళ్లించి నడుపుతున్నది. కాషన్ ఆర్డర్ కోసం న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌లో ఈ రైలుని రెండు నిమిషాలు నిలుపుదల చేస్తున్నారు. అయినప్పటికీ న్యూగుంటూరు నుంచి జనరల్ టిక్కెట్‌లు జారీ చేయడం లేదు. దీనిపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు హెడ్‌క్వార్టర్స్‌కు నివేదించి దారి మళ్లింపు ఉన్నన్ని రోజులు న్యూగుంటూరులో జనరల్ టిక్కెట్‌లు జారీ చేయాలని కోరుతున్నారు.



సైకిల్‌పై అరటి గెలలతో చెన్నుబోయిన పద్మ



తాను కరిగిపోతూ పలువురికి వెలుగునిచ్చే కొవ్వొత్తికి అమ్మకి దగ్గరి సారూప్యం కనిపిస్తుంది. నవమాసాలు మోసి..కనిన పిల్లలను పెంచి పెద్ద చేసేందుకు జీవితాన్నే ధారపోస్తుంది.ఆ ప్రయత్నంలో ఎంత బాధ ఉన్నా హాయిగా భరిస్తుంది. అటువంటి అమ్మ 'చిత్రమే' ఇది. సైకిల్ పై అరటి గెలలతో ఉన్న మహిళ పేరు చెన్నుబోయిన పద్మ. వయస్సు 48 సంవత్సరాలు. ఊరు గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు. భర్త, ముగ్గురు ఆడపిల్లలు కలిగిన నిరుపేద కుటుంబం. భర్త వ్యవసాయ కూలీ. వేడి నీళ్ళకు చన్నీళ్ళలా భర్తకు చేదోడుగా ఉండటానికి భారమైన బతుకు మార్గాన్ని ఎంచుకుంది.

అమ్మా.. నీకు వందనం

సైకిల్‌పై అరటి గెలలు పెట్టుకొని అమ్మడానికి ప్రతి రోజూ చాలా ఊర్లు తిరుగుతుంది. వానొచ్చినా.. ఎండొచ్చినా.. రోగమొచ్చినా..బాధొచ్చినా ఆ కష్టతరమైన ప్రయాణం మాత్రం ఆగదు.ఇలా అనేక సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది. ఈ రెక్కల కష్టంతోనే ఉన్న ముగ్గురు ఆడ పిల్లల్లో ఒకరికి పెళ్ళి చేసింది. మిగిలిన ఇద్దరు పిల్లలు గవర్నమెంట్ బడిలో చదువుకుంటున్నారు. వాళ్ళని పెద్ద వాళ్లను చేసి ప్రయోజకులను చేయటమే ఆమె సంకల్పం. గుండె నిండా ఊపిరి తీసుకొని ముందుకు సాగాల్సిన ఇంతటి కష్టతరమైన పనిలో ఉండి కూడా ఆమె ముఖంలో విసుగు కానీ.. నిరాశ.. నిస్పృహ కానీ మచ్చుకైనా కనిపించవు. అందుకే అంటారు.. అమ్మ అన్నది ఒక కమ్మని మాట..అది ఎన్నెన్నో తెలియని మమతల మూట అని. బిడ్డల కోసం.. వారి బాగోగుల కోసం.. నిరంతరం తాపత్రయపడే ఇటువంటి ఎందరో 'అమ్మ'లకు వేవేల వందనాలు.

-(గుంటూరు సిటీ,ఆంధ్రజ్యోతి)

మంగళగిరి చేనేత అద్భుతం

బ్రిటీష్ హైకమిషనర్ లిండే కామెరూన్

మంగళగిరి సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేతి మగ్గంపై తయారవుతున్న మంగళగిరి చేనేత వస్త్రాలు అద్భుతంగా ఉన్నాయని, అపురూపమైనవని బ్రిటీష్ హైకమిషనర్ లిండే కామెరూన్ తెలిపారు. లిండే కామెరూన్, ఆమె భర్త సీన్ రేనాల్డ్‌తో కలిసి బుధవారం మంగళగిరిలో పర్యటించారు. తొలుత మంగళాద్రి క్షేత్రాన్ని సందర్శించారు. దిగువ సన్నిధిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్‌శాలను సందర్శించారు. చేనేత నేసే విధానం, మగ్గంపై తయారైన ఉత్పత్తులను పరిశీలించారు. చీర నేసేందుకు పట్టే సమయం, శ్రమ, ఆదాయ వివరాలను నేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. లిండే కామెరూన్ స్వయంగా మగ్గం నేశారు. మహిళల కుట్టు శిక్షణా కేంద్రాన్ని సందర్శించి అక్కడ తయారవుతున్న జూటు బ్యాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కార్మికులు మగ్గంపై ఎంతో కళాత్మకంగా డిజైన్లను రూపొందిస్తున్నారన్నారు. చీర అంచుల్లో వస్తున్న డిజైన్లు తనను అమితంగా ఆకట్టుకున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, చేనేత జౌళి శాఖ ఏడీ ఉదయ్‌కుమార్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



వీవర్‌శాలలో మగ్గం నేస్తున్న బ్రిటీష్ హైకమిషనర్ లిండే కామెరూన్



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న బ్రిటీష్ హైకమిషనర్ లిండే కామెరూన్

విద్యుత్ వినియోగదారులకు అవగాహనా కార్యక్రమం

పెదనందిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు మండలంలోని విద్యుత్ వినియోగదారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఈ ఆంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎం సూర్యఘర్ విద్యుత్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందని, సోలార్ విద్యుత్ గృహాలకు ఏర్పాటు చేసుకునేందుకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని వినియోగదారులు సద్వినియోగించుకోవాలని తెలిపారు.



ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా నియమితులైన చిల్లపల్లి శ్రీనివాసరావు బుధవారం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. **(మంగళగిరి)**

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పెదనందిపాడు, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వారోత్సవాల కరపత్రాలను నిర్వాహకులు ఆవిష్కరించారు.

ఇంటింటికీ చెత్త సేకరణ తప్పనిసరి

● ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా సూచించారు. ఎంటీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరణను బుధవారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఆర్ఎంఎస్ స్కానర్లు పని చేస్తున్నాయో లేదో తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడి చెత్త సేకరణకు సిబ్బంది వస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమకు ఏవైనా సమస్యలుంటే ప్రత్యేక కాల్ సెంటరు 7093912653, 08645-295192 నెంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే పరిష్కార చర్యలు చేపడతామని కమిషనర్ తెలియజేశారు.

ఆత్మరక్షణకు కరాటే వంటి విద్యలు అవసరం

తాడేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల ఆత్మరక్షణకు కరాటే, తైక్వాండో, కిక్ బాక్సింగ్ వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యలు అవసరమని కేఎల్ యూనివర్సిటీ 22 ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ వి.మౌనిక విద్యార్థినులకు సూచించారు. తాడేపల్లి మండలంలోని చిర్రావూరు జిల్లా ఉన్నత పాఠశాలలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం మహిళల భద్రతలో భాగంగా విద్యార్థినులకు ఆత్మరక్షణలో మెళకువలు నేర్పించినట్టు ఆమె తెలిపారు. బయటకు వెళ్లే విద్యార్థినులు, ఉద్యోగినులు ఆకతాయిల వేధింపులకు గురైన సందర్భంలో కరాటే లాంటి విద్యలు నేర్చుకొని ఉండడం వల్ల తమను తాము రక్షించుకోవచ్చని సీఎస్ఈ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నాగమణి వివరించారు. ఆత్మరక్షణ కోసం మహిళలకు ప్రమాదం తలపెట్టేవారిని సెల్ఫ్ డిఫెన్స్ చేసుకోవడం వల్ల వారికి ఎటువంటి గాయాలైనా మహిళలపై ఎటువంటి కేసులు పెట్టే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై ఫిర్యాదులు, అర్జీల వెల్లువ

వట్టిచెరుకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే సందర్భంగా కొందరు రైతులకు చెందిన సాగు భూమి విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వాటి పరిష్కారానికే గ్రామ సభల నిర్వహణ ముఖ్య ఉద్దేశమని డీటీ దరియావలి రైతులకు వివరించారు. వట్టిచెరుకూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు డీటీ దరియావలి, మండల సర్వేయర్ కే వరప్రసాదు, వీఆర్వోలు, ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆదినారాయణ పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు, వినతి పత్రాలను స్వీకరించారు. మొత్తం 25 వినతి, ఫిర్యాదుల అర్జీలు రాగా 50 అర్జీలు భూమి తేడాలు, పది అర్జీలు పేరు మార్పు కోసం వచ్చాయని, త్వరలోనే అర్జీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని డీటీ హామీ ఇచ్చారు.

11 కేవీ వైర్ తెగి కాలిపోయిన వీధిలైట్లు.. 2 లక్షల నష్టం

ప్రత్తిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మంగళవారం కురిసిన వర్షాలకు విద్యుత్ 11 కేవీ వైర్ తెగి పంచాయతీ వీధిలైట్ల లైన్ మీద పడటంతో ఆ లైన్‌కు అనుసంధానంగా ఉన్న ఎల్ఈడీ వీధిలైట్లు మొత్తం కాలిపోయాయి. తూర్పుపాలెం, జగనన్న కాలనీలతో పాటు గ్రామంలోని కొన్ని వీధుల్లో లైట్లు పూర్తిగా కాలిపోయాయి. మొత్తం 85 లైట్లు కాలిపోయినట్లు పంచాయతీ అధికారులు గుర్తించారు. ఒక్కో లైటు విలువ సుమారు రూ.2500 ఉంటుందని, దీని వల్ల రూ.2 లక్షల పైనే నష్టం జరిగిందని పంచాయతీ కార్యదర్శి ఖాజా తెలిపారు. లైట్లు రిపేర్ చేయడానికి కూడా అవకాశం లేకుండా పోయిందన్నారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారని ఖాజా తెలిపారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

తాడికొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వీ రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకి రక్తదానం మిన్న అన్నారు. ఆరోగ్యంగా ఉన్న ఏ వ్యక్తి అయినా తమ రక్తాన్ని దానం చేయ వచ్చునని తెలిపారు. ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో 131 యూనిట్లు రక్తాన్ని ఇచ్చారన్నారు. 2005 నుంచి చలపతి ఫార్మసీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రొఫెసర్ కేవీఎన్ రజనీకాంత్, డాక్టర్ జీ.నాగరాజు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీళ్లు అగ్రిమెంట్ ఇవ్వరు.. వాళ్లు అద్దె చెల్లించరు

● లక్షల విలువైన ఇనుప చువ్వలు మట్టిపాలు

● గృహ నిర్మాణ శాఖ నిర్వాకం

మేడికొండూరు నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పేదల గృహ నిర్మాణానికి ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి తెప్పించిన ఇనుప చువ్వలు అధికారుల నిర్వాకం కారణంగా మట్టిపాలు అవుతున్నాయి. ప్రవేటు గోడౌన్ వారు గృహ నిర్మాణశాఖ వారికి అద్దెకు సంబంధించి అగ్రిమెంట్ ఇవ్వాల్సి ఉండగా వారు ఇవ్వడం లేదు. దీంతో గృహ నిర్మాణ శాఖ వారు అద్దె చెల్లించరు. ఫలితంగా గృహ నిర్మాణాల కోసం లక్షల వెచ్చించి తెచ్చిన ఇనుము వృధాగా ఆరుబయట పడి ఉంది. గోడౌన్ యాజమాని, నిర్మాణ శాఖ అధికారుల మధ్య తలెత్తిన ఈ వ్యవహారం రెండేళ్లగా ఒక కొలిక్కి రాలేదు. మేడికొండూరు మండల పరిధిలో పేదల గృహల నిర్మాణం కోసం ఆ శాఖ అధికారులు మూడు లారీల్లో సుమారు 60టన్నుల ఇనుప చువ్వలు కొనుగోలు చేసి పేరేచర్ల పరిధిలోని ఒక ప్రవేటు గోడౌన్‌ను అద్దెకు తీసుకొని అందులో నిల్వ ఉంచారు. కొంత గృహ నిర్మాణాలకు వినియోగించగా ఎక్కువ శాతం గోడౌన్‌లోనే ఉంది. ఇదిలా ప్రతి నెలా అద్దె ఇవ్వడం లేదని యజమాని నిర్మాణ శాఖాధికారులను నిలదీశాడు. మీరు అగ్రిమెంట్ ఇస్తే అద్దె చెల్లిస్తామని అధికారులు చెప్పడంతో కారణంగా అగ్రిమెంట్ విషయం తమకు ముందుకు చెప్పలేదని, ఇప్పుడు ఎగ్రిమెంట్ ఎందుకు ఇస్తానని యాజమాని భీష్మించడంతో అధికారులు అద్దె చెల్లించలేదు. ఈ వివాదం రెండేళ్లగా కొనసాగడంతో అద్దె బకాయిలు పేరుకుపోయాయి. ఇక అధికారులు అద్దె చెల్లించరని భావించిన గోడౌన్ యాజమాని గోడౌన్‌లో ఉన్న ఇనుమును ఖాళీ స్థలములో పడేశారు. కొంత ఇనుము దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. మిగిలిన ఇనుప చువ్వలు వర్షాలకు తడిసి తుప్పు పట్టి మట్టిలో కలసి పోతున్నాయి. అవి గృహ నిర్మాణాలకు పనికి రావని చెబుతున్నారు. టన్ను సుమారు 56వేలకు పైగా ధర ఉండగా దాదాపు 20 టన్నుల ఇనుము ఎందుకు పనికి రాకుండా పోతుందని స్థానికులు విమర్శిస్తున్నారు.



పేరేచర్లలోని ఒక ప్రవేటు స్థలంలో వృధాగా పడివున్న ఇనుప చువ్వలు

రైల్వే లైన్ పెగ్ మార్కులను అడ్డుకున్న రైతులు

● వరి చేను తొక్కుకుంటూ హద్దు రాళ్లు వేయటంతో రైతుల ఆగ్రహం

● పరిహారం ప్రకటించకుండా హద్దు రాళ్లు ఎలా వేస్తారు?

● పొలాల్లో వేసిన హద్దు రాళ్లను పీకేసిన రైతులు



రైల్వే లైన్ పెగ్ మార్కులు వేస్తున్న రైల్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

తాడికొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నూతన రైల్వేలైన్‌కి అధికారులు చేపట్టిన పెగ్ మార్కింగ్‌లను వేయటానికి వీల్లేదని తాడికొండ రైతులు అడ్డుపడ్డారు. కంతేరు మీదుగా తాడికొండ రెవెన్యూ పరిధిలో ఉన్న భూముల్లో రైల్వే అధికారులు, రెవెన్యూ అధికారుల సమన్వయంతో పెగ్ మార్కులు వేయటానికి బుధవారం సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రైతులు పెగ్ మార్కింగ్ ప్రదేశానికి చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు తెలియజేయకుండా, వారి అభిప్రాయాలకు సేకరించకుండా పెగ్ మార్కులు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఎలాంటి పరిహారం ప్రకటించకుండా పెగ్ మార్కులు వేస్తే రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. వరి పొలాల్లో నుంచి తొక్కకుండా మార్కింగ్ వేయటంతో పాటు హద్దు రాళ్లను వేయటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పెద్ద ఎత్తున రైతులు సంఘటన స్థలానికి చేరుకొని హద్దురాళ్ల ట్రాక్టర్లను బయటకు తీసుకువచ్చి రైల్వే అధికారులతో వాగ్వాదానికి దిగారు. పచ్చని పొలాల్లోకి ట్రాక్టర్లను ఎలా తీసుకు వెళ్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఎవరు చెల్లిస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే పెగ్ మార్కింగ్‌ను మధ్యాహ్నం రైతులు అడ్డుకోవ టంతో తహసీల్దార్ కే.నాసరయ్య రైతులతో సంప్రదిం పులు జరిపారు. అనంతరం సాయంత్రం మరోసారి పెగ్ మార్కింగ్ వేసే క్రమంలో పొలాల్లోకి ట్రాక్టర్లు తీసుకువెళ్లటంతో రైతులు అడ్డుకున్నారు. అంతేగాకుండా తమ పొలాల్లో హద్దు రాళ్లు ఎవరిని అడిగి వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హద్దు రాళ్లను రైతులు తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము వచ్చామని చెప్పటంతో, మీకు చెప్పి పంపిన వాళ్లను ఇక్కడకు రావాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి వరకు ఇక్కడ నుంచి పంపమని తేల్చిచెప్పారు. రైల్వే లైన్ నిర్మాణానికి రైతుల అభిప్రాయాలు తెలియజేయటానికి 30 రోజులు గడువు ఇచ్చారని.. గడువు పూర్తికాకుండానే రైతుల పొలాల్లో పెగ్ మార్కులు ఎలా వేస్తారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు భూములు ఏ విధంగా ఇచ్చారో.. అదేవిధంగా భూములను సమీకరించాలని రైతులు విజ్ఞప్తులు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లామని రైతులు అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకుండా పెగ్ మార్కులు వేస్తే ఊరుకోమని తెల్చిచెప్పారు.

కలెక్టర్ చెప్పినా మారని సచివాలయ సిబ్బంది తీరు





తాళాలు కూడా తీయని పెదనందిపాడు సచివాలయం, నాగులపాడులో అధికారుల కోసం వేచి ఉన్న అర్జీ దారులు

పెదనందిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది తీరు మండలంలో రోజు రోజుకు ప్రశ్నార్థకంగా మారుతుంది. మేమింతే.. మారమంతే అన్నట్టుగా సిబ్బంది తీరు ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో సేవలు అందించాల్సిన సిబ్బంది ఒక్కరు కూడా కనిపించరు. వివిధ కారణాలతో సచివాలయాలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నా వారి బాధలు వినేవారు మాత్రం ఉండటం లేదు. ఇటీవల పెదనందిపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా సచివాలయాలు కనిపిస్తున్నాయి. వివిధ కారణాలు చెపుతూ సిబ్బంది కార్యాలయంలో ఉండటం లేదనే వాదన సర్వత్రా వినిపిస్తుంది. ఇటీవల పెదనందిపాడు వచ్చిన కలెక్టర్ ఈ విషయంలో సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చారు. కానీ షరా మాములుగానే కనిపిస్తుంది.

పట్టణంలోని పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

మంగళగిరి సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ఎస్ చెంగయ్య కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం గండాలయపేట, కొత్తపేట, దేవస్థానం రోడ్డు, మెట్ల మార్గం, ఏపీఎస్పీ క్యాంపు రోడ్డు, వీవర్స్ కాలనీ, వడ్లపూడి సెంటరు, ద్వారకానగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. చెంగయ్య మాట్లాడుతూ పట్టణంలో డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొండ పోరంబోకు స్థలాల్లో ఇళ్లు వేసుకుని నివసిస్తున్న పేదలకు డిఫారెస్ట్ చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పిల్లలమర్రి బాలకృష్ణ, జేవీ రాఘవులు, ఎం బాలాజీ, జే.బ్రాహ్మణి, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.


● తాడేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామం మదర్ థెరిసా కాలనీలో సీపీఎం శ్రేణులు ప్రజా పోరు కరపత్రాలు బుధవారం పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పోరంబోకు వివిధ రకాల భూముల్లో నివాసం ఉండే వారికి రెగ్యులర్ చేసి పట్టాలు ఇవ్వాలని, అధిక ధరలు తగ్గించాలని, రైతులకు పెట్టుబడి సహాయం ఇవ్వాలని, పంట పొలాల ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ నవంబరు 14వ తేదీన తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెదనందిపాడు, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాపోరు ప్రచార ఉద్యమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే గుంటూరు ఛానెల్ పనులు ప్రారంభించాలని, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచాలని, సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి ఇళ్ళ స్థలాలు ఇచ్చి నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కరిముల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కొత్త వెంకటశివ, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, మాదల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● కాకుమాను, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు చానల్ ఆధునీకరణకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేటాయింపులు చేసి పనులను ప్రారంభించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకుమాను, కొమ్మూరు, పెద్దివారిపాలెం, కొమ్మూరు గ్రామాలలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా పోరు ప్రచార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం పెదనందిపాడు మండల కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల తాగు, సాగు నీటి కష్టాలను వెంటనే తీర్చాలన్నారు. ఇసుక కొరతను నివారించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొత్త వెంకట శివరావు, సభ్యులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మాట్లాడే దేవుడిగా మారాలి

● ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి



శ్రీసద్గురు శుభవేదికను ప్రారంభిస్తున్న పరిపూర్ణానందగిరి స్వామి

దుగ్గిరాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దలకు సేవ చేసుకుని వారి ఆశీస్సులు పొందిన వారే భగవంతుడికి ప్రియమైన భక్తులని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి అన్నారు. దుగ్గిరాలలోని శ్రీ విమలానందస్వామి ఆశ్రమ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీసద్గురు శుభవేదికను బుధవారం ఆయన ప్రారంభించారు. పరిపూర్ణానందగిరి స్వామి మాట్లాడుతూ మనం భగవంతునికి ప్రియమైన వారిగా నిలబడాలంటే ఏ ఒక్కరికీ హాని చేయకుండా ధ్యానం చేస్తూ, మన సంపాదించిన దాంట్లో కొంతభాగాన్ని సేవకు వినియోగించాలన్నారు. తనకున్నదాంట్లో కొంత ఇతరుల కోసం ఖర్చుపెడుతూ ఆత్మసంతృప్తితో జీవించే వారు ధన్యులని అన్నారు. చింతమనేని అప్పారావు జ్ఞాపకార్థం, భార్య అప్పమాంబ, కుమారుడు ఎన్నారై పిచ్చయ్య చౌదరి, నిర్మలా చౌదరి తదితరుల సహకారంతో సుమారు రూ.35 లక్షల ఖర్చుతో నిర్మించిన సద్గురు శుభవేదిక ద్వారా మహిళా మండలి నాయకురాలు జంపాల కుసుమకుమారి మరిన్ని సేవలందించేందుకు భగవంతుడు ఆమెకు ఆయురారోగ్యాలనివ్వాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఎన్నారై డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్ర, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, కేసంనేని శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు, పసుపులేటి గణేష్, మహిళలు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం వద్దు

తాడికొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టరాదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడికొండ గ్రామంలోని రెడ్ల బజారులోని ఓ ఇంటిపై బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణాన్ని బుధవారం చేపట్టారు. స్థానిక ప్రజలు సెల్ టవర్ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శికి సెల్ టవర్‌ను నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు. అయితే గత అక్టోబరు నెలలో సెల్ టవర్ నిర్మాణానికి అంగీకారం తెలియజేసిన భవన యజమానితో మాట్లాడితే సెల్‌టవర్ నిర్మాణం చేయనని చెప్పి ఇప్పుడు టవర్ నిర్మాణం చేపట్టడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సెల్ టవర్ నిర్మాణం చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్‌లో చేనేతకు నిధులు పెంచాలి

మంగళగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్‌లో చేనేతకు కేవలం రూ.172 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రామనాథం పూర్ణచంద్రరావు అన్నారు. దేశంలో వ్యవసాయం తర్వాత అతి పెద్ద ఉపాధి రంగంగా ఉన్న చేనేత పరిశ్రమ పాలకుల తీరు కారణంగా సంక్షోభంలోకి నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారని, నేటి వరకు విధివిధానాలను ప్రకటించలేదని తెలిపారు. బడ్జెట్‌లో చేనేతకు నిధులు పెంచి పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

మంగళగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబించేలా ఉందని టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు అన్నారు. సంపద సృష్టించేందుకు, ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు ఈ బడ్జెట్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి రంగాలకు నిధులు కేటాయించడం గొప్ప విషయమన్నారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో మంగళగిరి నియోజక వర్గం రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బాలల దినోత్సవ పోటీలు

తాడేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలోని వర్సిటీ ప్రాంగణంలో పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు, మంగళగిరి మండలం నూతక్కి, తాడేపల్లి మండలం చిర్రావూరుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా క్విజ్ పోటీలను నిర్వహించినట్టు స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ సీఈవో, సాక్ డైరెక్టర్ సాయి విజయ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ కేఎల్‌యూ విద్యార్థుల ద్వారా పాఠశాల విద్యార్థులకు మొదటి అకడమిక్‌లో ఉన్న ప్రావీణ్యాన్ని తెలుసుకోవడం కోసం మొదటి రౌండ్ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, స్థానాలకు ఎంపిక చేసి మూడు పాఠశాలల నుంచి సెకండ్ రౌండ్‌కు చేరుకున్న వారిని కేఎల్‌యూ తీసుకువచ్చి వారికి సెకండ్ రౌండ్ జనరల్ నాలెడ్జ్, రీజనింగ్ సబ్జెక్టులపై క్విజ్ నిర్వహించారు.

బెల్ట్ షాపుల నియంత్రణపై దృష్టి పెట్టాలి

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ



డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మకి మొక్కను అందజేస్తున్న సీఐ

మంగళగిరి సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులు, గంజాయి నియంత్రణపై దృష్టి సారించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ సూచించారు. మంగళగిరి ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరాలకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. బెల్ట్ షాపులు, గంజాయి, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ నియంత్రణకు సంబంధించి పలు సూచనలు చేశారు. వైన్‌షాపుల్లో ఎమ్మార్పీ ధరల ఉల్లంఘనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు డీపీఈవో వి.అరుణకుమారి, ఏపీ అండ్ ఈఎస్ ఈ.మారయ్యబాబు, మంగళగిరి ఎక్సైజ్ సీఐ జీ.వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత కోచింగ్ హర్షణీయం

● కేసన శంకరరావు

మంగళగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభిస్తున్నట్టు బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత ప్రకటించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఇదే అంశమై గతంలో తమ సంఘం తరపున విజ్ఞాపన పత్రాన్ని అందించామని, ప్రభుత్వం వెంటనే స్పందించి వెనుకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభించబోయే ఈ సెంటర్ల ద్వారా ఒక్కో సెంటరులో 200 మంది అభ్యర్థుల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 5,200 మందికి శిక్షణ ఇస్తారని చెప్పారు. అందులో బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం సీట్లతోపాటు 520 సీట్లు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ కోటా కింద కేటాయిస్తారని తెలిపారు. ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్‌లోనూ కోచింగ్ ఇస్తారని, రెండు నెలల శిక్షణా కాలంలో నెలకు రూ.1500 చొప్పున స్టయిఫండ్, మెటీరియల్ కోసం మరో రూ.వెయ్యి ఇస్తారని తెలియజేశారు. టీఈడీతోపాటు టెట్ ఉత్తీర్ణత సాధించిన వారికి మాత్రమే కోచింగ్ ఇస్తున్నట్టు చెప్పారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మంత్రి లోకేశ్ ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తి అరెస్టు



ఫిరంగిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫొటోలను మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన షేక్ జాన్ మహబూబ్ సుభానీ ఉరఫ్ జాన్ అవమానకరంగా సోషల్ మీడియాలో పెట్టినందున ఫిరంగిపురం ఎస్ఐ రవీంద్ర బాబు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నరసరావుపేట రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా నిందితుడికి ఈనెల 26వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించిందని సీఐ బుధవారం తెలిపారు.

అసభ్యకర పోస్టులపై కేసు నమోదు

మంగళగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను కించపరుస్తూ సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వ్యక్తిపై మంగళగిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 21వ తేదీన ఐ.వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి జర్నలిస్ట్ డైరీ-2 అనే గ్రూపులో మంత్రి నారా లోకేశ్‌ను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఐటీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కరీముల్లా మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వెంకటేశ్వరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనంతవరం జడ్పీ హైస్కూల్లో చోరీకి విఫలయత్నం

తుళ్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అనంతవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆఫీసు, స్టాఫ్ రూం గదులను పగలగొట్టి ఉండటం బుధవారం ఉదయం సిబ్బంది గుర్తించారు. బీరువాలు తెరవటానికి దొంగలు విఫలయత్నం చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు హెచ్ఎం సమాచారం ఇవ్వగా ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి పరిశీలించారు. ఇలా జరగటం ఇది మూడోసారి అని గ్రామస్థులు చెపుతున్నారు. వాచ్‌మన్ ఉన్నా కాని గదులు పగలగొట్టడంపై వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

భీమినేనివారిపాలెం గృహంలో చోరీ

మేడికొండూరు నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం భీమి నేనివారిపాలెం గ్రామంలోని పాటిబండ్ల కోటేశ్వరరావు ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించి దోపి డీకి ప్రయత్నించారు. ఇంట్లో విలువైన వస్తువులు దొరక్కపోవడంతో బీరువాను పగుల గొట్టి దానిలో ఉన్న వస్తువులు చెల్లాచెదురుగా పడేశారు. ఇటీవల కోటేశ్వరరావు తన ఇంటికి తాళాలు వేసి హైదరాబాదులో ఉన్న తన కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంటికి తాళాలు వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు ఇంటి ప్రధాన ద్వారం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. లోపల ఉన్న బీరువాను తెరిచి అందులోని వస్తువులు బయట పడేశారు. అయితే ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు ఏమి లేవని తెలిసింది. ఉదయం ప్రధాన ద్వారం పగులకొట్టి ఉండటాన్ని గుర్తించిన ఇరుగుపొరుగు వారు హైదరాబాదులోని శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. దొంగతనం విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు తన తండ్రి కోటేశ్వర రావుతో కలిసి భీమినేనివారి పాలెం చేరుకుని మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేడికొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు.

చెత్త సేకరణ ప్రారంభం ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● ముందస్తు ప్రణాళికతో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

● పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి షేక్ ఖాజా



చెత్త సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రత్తిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ అయిన ప్రత్తిపాడులో పంచాయతీ అధికారులు ఎట్టకేలకు గ్రామంలో చెత్త సేకరణ ప్రారంభించారు. 'ఎక్కడి చెత్త అక్కడే' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. ముందస్తుగా గ్రామంలో చెత్త సేకరణను ప్రారంభించినట్లు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి షేక్ ఖాజా తెలిపారు. డంపింగ్ యార్డు వద్ద ఉన్న చెత్తను తరలించడంతో పాటు వర్మీకంపోస్టు తయారు చేసేందుకు కూడా ప్రణాళిక తయారు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. త్వరలో జరిగే పంచాయతీ సమావేశంలో ఈ అంశాలపై చర్చించి చెత్తను జిందాల్ పవర్ ప్లాంటుకు తరలించడం, వర్మీకంపోస్టు తయారుచేసే ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు.

ఇసుక లారీ సీజ్

తుళ్లూరు, నవంబరు 13: (ఆంధ్రజ్యోతి) ఇసుక లారీని తుళ్లూరు పోలీసులు బుధవారం తెల్లవారుజామున సీజ్ చేశారు. వెలగపూడి వద్ద తనిఖీల్లో భాగంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని గుర్తించారు. స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

వంట గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలపై అవగాహన

తెనాలి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చెంచుపేట కేఎస్ఎం హైస్కూల్‌లో వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ప్రతినిధులు డెమో ద్వారా గ్యాస్ ప్రమాదాలపై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. డిజిటల్ వీడియోలు ప్రదర్శించారు. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ మురళీకృష్ణ, ఐవోసీ ప్రతినిధులు మాధవీలత, రిటైర్డ్ ప్రిన్సిపల్ పావులూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో చిరు వ్యాపారి మృతి

పొన్నూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మునిపల్లె గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం తెనాలి ఇందిరా కాలనీకి చెందిన తాడిమల్ల చిన్నవెంకటేశ్వర్లు ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం వ్యక్తిగత పనులపై పొన్నూరు మండలం కట్టెంపూడిలోని బంధువులను కలిసి తిరిగి వెళ్లుతున్న సమయంలో మామిళ్లపల్లి అడ్డరోడ్డు వద్ద అశోక్ లేల్యాండ్ వాహనం ఢీకొని సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వెంకటేశ్వర్లు మృతదేహాని శవ పరీక్షల కోసం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తి అరెస్టు

పెదకాకాని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పెదకాకాని చెందిన ఆ వ్యక్తి ఓ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లొంగ తీసుకొని, అత్యాచారం చేశాడు. నిందితుడిపై ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేపు కృష్ణ సినీ పాటల గానామృతం

తెనాలి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ కృష్ణ సినీ పాటల గానామృతం, జీవిత సాఫల్య పురస్కార మహోత్సవం శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. కృష్ణ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఈదర వెంకటపూర్ణచంద్ మాట్లాడుతూ, తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కృష్ణ ద్వితీయ వర్ధంతి పురస్కరించుకుని ఈ నెల 15న నిర్వహించే కార్యక్రమాలకు అభిమానులు హాజరు కావాలని కోరారు. హైదరాబాద్‌కు చెందిన కృష్ణ అభిమాని చేబ్రోలు మాధవరావుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తామన్నారు.

సీపీఎం సీనియర్ నేత కృష్ణమూర్తి మృతి

తెనాలి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు పటాపంచెల కృష్ణమూర్తి (86) బుధవారం మృతి చెందారు. ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేసిన ఆయన కార్మిక సంఘంలో డివిజన్ అధ్యక్షుడిగా దీర్ఘకాలం ఉన్నారు. పదవీ విరమణ చేశాకకూడా పార్టీకి సేవలు అందించారు. పార్టీ నాయకులు కె.బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, జోనేష్, హుస్సేన్‌వలి, రాజ్యలక్ష్మి తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కూరగాయల మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలి

పొన్నూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలని బుధవారం వర్తక సంఘాల నాయకులు కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందచేశారు. మార్కెట్‌లో గేట్లు విరిగిపోయి ఏళ్లు గడుస్తున్న మరమ్మతులు చేయించలేదన్నారు. గేట్లులేక కూరగాయల దుకాణాల్లో రాత్రివేళ అపరిచితుల సంచారం పెరిగిందని, గేట్లు అమర్చాలని విజ్ఞప్తి చేశారు. వర్తక సంఘం నాయకులు శ్రీనివాస్, షేక్ నజీర్లు పురపాలక సంఘంకు రెండు పవర్ స్ప్రేయర్లను బహూకరించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల్లా రోడ్లు

● స్తంభించిన మురుగునీరు ● దుర్వాసనతో గ్రామస్థులకు ఇక్కట్లు



మున్నంగిలో చెత్తతో నిండిపోయిన కాలువ రోడ్డు

కొల్లిపర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు గ్రామాల్లో ప్రయాణించాలంటే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను రహదారుల పక్కనే పడవేయడంతో ఈ సమస్య ఏర్పడుతుంది. రోజుల తరబడి వ్యర్థాలు నిల్వ ఉంటే భరించలేని దుర్వాసన వెదజల్లుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారు. మేజర్ పంచాయతీల్లో సేకరించిన వ్యర్థాలను ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా ఊరికి శివారులో ఉన్న ప్రాంతాలకు తరలించి రోడ్డు పక్కనే పారబోస్తున్నారు. వ్యర్థాలలో వరాహాలు, మూగజీవాలు సంచరిస్తుండటంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. వ్యర్థాలు అన్నీ రోడ్డు మీదకు జారి రహదారి మొత్తం అపరిశుభ్రంగా తయారవుతోంది. అంతేకాకుండా సేకరించిన పొడి చెత్తను తగలబెడుతుండటంతో రహదారి మొత్తం పొగ అవరించి దారి కనిపించకుండా పోతోంది. దీంతో వాహనదారులు ఏ మాత్రం అదమరిచినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మండల పరిధిలోని దావులూరు వెళ్లే రోడ్డు, అత్తోట కమతావారిపాలెం వెళ్లే రోడ్డు, మున్నంగి వెళ్లే రోడ్డులో, దంతలూరు వెళ్లే రోడ్డులో వ్యర్థాలు పారబోస్తుండటంతో రోడ్లు మూసుకుపోతున్నాయి. దీంతో ఈ రోడ్లపై వెళ్ళాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వ్యర్థాలపై అనేక పర్యాయాలు అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పలు గ్రామాల్లో మురుగునీరు స్తంభించండంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో చెముడుబాడు, చక్రాయపాలెం, అత్తోట, పిడపర్రు తదితర గ్రామాల్లో మురుగునీరు ఎక్కడికక్కడ స్తంభించడంతో ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోమోనని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలపై దృష్టి పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



దంతలూరులో రోడ్డు పక్కన పేరుకుపోతున్న వ్యర్థాలు

చెదురుమదురుగా వర్షం.. బెంబేలెత్తుతున్న రైతులు

కొల్లిపర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చినుకులు పడుతుంటే అన్నదాతల గుండెల్లో రైళ్లుపరిగెత్తుతున్నాయి. గత రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు రావటంతో పాటు మబ్బులు కమ్ముకొచ్చి వర్షం పడటంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా చెదురుమదురుగా వర్షం పడటంతో డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో వరి పొలాలు అక్కడక్కడ నేలకొరిగాయి. ఖరీఫ్‌సాగు తుది దశకు చేరుకుంటున్న తరుణంలో వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఖరీఫ్‌లో ముందస్తుగా వెదపద్ధతి ద్వారా వేసిన వరినాట్లు కోత దశకు, అలస్యంగా వేసిన వరినాట్లు గింజ గట్టి పడే దశకు రావటంతో వర్షానికి పంట పడిపోయి ఎక్కడ దెబ్బతింటుందేమోనని రైతులు ఆందోళనకు గురయ్యారు. వ్యయప్రయాసల కోర్చి పండించిన పంట ఈ సమయంలో వర్షం పడితే అపారమైన నష్టం వాటిల్లుతుందని రైతులు వ్యక్తం చేస్తున్నారు. వరిలో దిగుబడులు కూడా తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. వర్షాలు కారణంగా కంకి రాలిపోవడం, తాలువేయడం, మానుకాయ ఏర్పడే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



అత్తోట సమీపంలో వర్షానికి నేలకొరిగిన వరిపంట

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి

● పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపార సంస్థల యజమానులు మైక్రో, స్మాల్ అండ్ మీడియా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) సర్వేకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న కోరారు. స్థానిక షరాఫ్‌బజార్ మూర్తి కొండయ్య వీధిలో బుధవారం పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి ఎంఎస్ఎంఈ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సంస్థలు, చిన్నచిన్న కుటీర పరిశ్రమలు, భారీ పరిశ్రమలను నిర్వహించే ప్రతి ఒక్కరూ ఈ సర్వేలో తమ సంస్థలను నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి రావలసిన సబ్సిడీలు, బ్యాంకు నుంచి రుణాలు పొందడానికి సులభతరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



షాపుల సర్వేను నిర్వహిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

డ్రెయిన్‌లపై ఆక్రమణలను తొలగించండి

● మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని అధికారులకు పట్టణ పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు ఆదేశించారు. స్థానిక నాజరుపేటలోని 9, 10వ వార్డులలో బుధవారం జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు క్షేత్ర స్థాయిలో అధికారులతో కలసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్‌లను ఆక్రమించరాదని, మురుగు నీటి పారుదలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు. వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని లేకుంటే తాము తొలగిస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

తెనాలి, మారీసుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముఖ్యమైన రహదారుల విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. స్థానిక బోసురోడ్డులో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ శేషన్నతో కలసి రోడ్డు విస్తరణ పనులకు భూమి పూజను నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో విస్తరణ పనులను ప్రారంభించామన్నారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వకుండా విస్తరణ పనులను చేసట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు, అసిస్టెంటు సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

చినరావూరు పార్కు అభివృద్ధి పనుల పరిశీలన

చినరావూరులోని సత్యనారాయణ పార్కులో బుధవారం మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు పార్కు అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పైరులో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి: ఏవో

పొన్నూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరి పైరులో ఆశించే పాము పొడ అగ్గి తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని ఏవో డేగల వెంకటరామయ్య అన్నారు. మండల పరిధిలోని జూపూడి, వెల్లలూరు గ్రామాలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పైరును పరిశీలించి అగ్గి తెగుళ్ల, పాము పొడ తెగుళ్ల నివారణ మందుల పిచికారిపై అవగాహన కల్పించారు. నవధాన్యాంకుర కషాయం తయారీ, పంటల సాగులో వినియోగంపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తెనాలి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం అవుతాయని నెహ్రూరోడ్డు శాఖా గ్రంథాలయాధికారి కె.రమాదేవి, కొత్తపేట మహిళా బాలల గ్రంథాలయ అధికారి కె.అంజని తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే వివిధ పోటీలలో బాలబాలికలు పాల్గొనాలని కోరారు.

వరిలో మెడ విరుగుడు తెగులు నివారణకు చర్యలు చేపట్టండి

● లాం ఫాంశాస్త్రవేత్త డాక్టర్ రత్నం

తెనాలి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరిలో వచ్చే మెడ విరుగుడు తెగులు నివారణకు సస్య రక్షణచర్యలు చేపట్టాలని లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అంగలకుదురు-1, చావావారిపాలెం గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న వరిపైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగుసూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నం మాట్లాడుతూ వరి పైర్లలో అక్కడక్కడా మెడవిరుగుడు తెగులును గుర్తించడం జరిగిందన్నారు. దాని నివారణకు ట్రైసైక్లోజోల్ అనే మందును ఎకరాకు 120 గ్రాముల చొప్పున పిచికారి చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ మాట్లాడుతూ రబీసీజన్లో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలు సాగు చేపట్టే రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియంను దగ్గరలోని మీ సేవా, లేదా సీఎస్‌సీ సెంటర్లను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

దశావతార వెంకన్నను దర్శించుకున్న విజయానందతీర్థ స్వామి

పెదకాకాని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రాన్ని అవధూత దత్తపీఠ ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామిజీ బుధవారం దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కార్తీకమాస ప్రదోషకాలంలో స్వామివారిని దర్శించుకుని భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, భక్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో హకీంజానీకి గెస్ట్ లెక్చర్ అవకాశం

తెనాలి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సాహిత్యవేత్త షేక్ అబ్దుల్ హకీం జానికి ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో గెస్ట్ లెక్చరర్ అవకాశం లభించింది. ఎంబీఏ విద్యార్థులకు పర్యాటక ప్రదేశాలపై ఉపన్యాసం ఇవ్వాలని ప్రొఫెసర్ పూర్ణచంద్రరావు ఆయనకు లేఖ పంపారు. సంపూర్ణ భారత దేశ యాత్ర పేరుతో పర్యాటక ప్రదేశాలపై పుస్తకం రాయడంతో పాటు వ్యాసాలు కూడా ప్రచురించారు. దీనిని గుర్తించిన యూనివర్శిటీ ప్రొఫెసర్ ఆయనకు ఈ నెల 18న గెస్ట్‌లెక్చర్ అవకాశం ఇస్తూ లేఖ అందించారు.

ఎమ్మెల్యే ధూళిపాళ్ళకు సముచిత స్థానం కల్పించాలి

● ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరుసార్లు పొన్నూరు శాసన సభ్యుడిగా ఎన్నికైన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని టీడీపీ సీనియర్ నాయకులు ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి పొన్నూరును కంచుకోటగా మలిచిన ఘనత ధూళిపాళ్ళ కుటుంబానికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, వైసీపీ హయాంలో జగన్‌రెడ్డి నరేంద్ర కుమార్‌ను తీవ్ర వేధింపులకు గురిచేశారన్నారు. టీడీపీ జెండా వదలనందుకే నరేంద్ర కుమార్‌ను జైలులో పెట్టి వేధింపులకు గురిచేశారన్నారు. పార్టీపట్ల నిబద్ధతతో పనిచేసే నరేంద్రకుమార్‌కు మంత్రి పదవి, క్యాబినెట్ పదవులు లభించకపోవటంపై కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, ఆకుల సాంబశివరావు, బొర్రు రామారావు, అలపర్తి చంద్రమోహన్, యరసాని శ్రీరామమూర్తి, షేక్ బాజీ సాహెబ్, కత్తుల రవికిరణ్, చల్లశెట్టి సీతరామయ్య, గణిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో విశ్వసనీయతకు, విధేయతకు మారుపేరుగా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ నిలిచారని పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అత్యంత సీనియర్ అయిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. వైసీపీ వేధింపులకు గురై 32 రోజులు జైలు జీవితాన్ని గడిపిన నరేంద్రకు పార్టీలో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఇచ్చి సత్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు అప్పగించిన అనేక బాధ్యతలను ఆయన త్రికరణశుద్ధిగా, విశ్వసనీయతతో పని చేశారన్నారు. నిబద్ధతతో ఉండే నరేంద్రకుమార్‌కు పార్టీలో జరుగుతున్న అన్యాయాన్ని నియోజవర్గంలోని నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించి రాష్ట్రస్థాయిలో క్యాబినెట్ ర్యాంకులు పదవులు నరేంద్రతో కల్పించాలని నాయకులు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ పదవికి బాజీ సాహెబ్ రాజీనామా

పొన్నూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు మంత్రి వర్గంలో, క్యాబినెట్ ర్యాంక్‌లో సముచిత స్థానం కల్పించకపోవటం బాధకరంగా ఉందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధికారి ప్రతినిధి షేక్ బాజీ సాహెబ్ అన్నారు. బుధవారం తన అధికార ప్రతినిధి పదవికి బాజీ సాహెబ్ రాజీనామా చేశారు. ఆరు పర్యాయాలు శాసన సభ్యుడిగా ఎన్నికైన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అనుక్షణం ప్రజలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవటం, హామీఇచ్చిన చీఫ్ విప్ పదవిని కూడా కేటాయించకపోవటం బాధ కలిగిస్తోందన్నారు. తమ ఆవేదనను పార్టీ అధిష్టానానికి తెలియజెప్పేందుకు రాజీనామా చేస్తునట్లు బాజీ సాహెబ్ తెలిపారు.

అన్నవరంలో తెనాలి గాయకుల కీర్తనలు

తెనాలి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంలో తెనాలి గాయకులు కీర్తనలు ఆలపించారు. శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో బుధవారం అన్నవరం ఆలయంలో జరిగిన తెప్పోత్సవంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కీర్తనలు ఆలపించే అవకాశం ఇచ్చారు. రెండు గంటల పాటు కొండపి వసుంధర బృందం మాజేటి వాసవి, గుబ్బా లక్ష్మీ, వినతి, కనకదుర్గ, రత్నకుమారి, కీర్తనలు ఆలపించారు. సాయి, పెద్దిరాజు వాయిద్య సహకారం అందించగా కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

● త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని అతిక్రమిస్తే జరిమానాలను విధిస్తామని తీటౌన్ సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. పట్టణంలోని మార్కెట్ సెంటర్, ఫ్లైఓవరు వద్ద ఉన్న ఆటోస్టాండ్‌లోని ఆటో డ్రైవర్‌లకు సీఐ రమేష్‌బాబు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన ప్రదేశాలలోనే ఆటోలను నిలపాలన్నారు. ఆటోలను ఇష్టారాజ్యంగా నిలపరాదని రాకపోకలకు ఇబ్బందులు కలిగించరాదని, మద్యం సేవించి ఆటోలను నడిపితే చట్టప్రకారం భారీ జరిమానాలను విధిస్తామన్నారు. జరిమానాలను చెల్లించని ఆటోలను సీజ్‌చేసి స్టేషన్‌కి తరలిస్తామని హెచ్చరించారు. సీఐ రమేష్‌బాబు ఆటో డ్రైవర్‌లకు కౌన్సెలింగ్ చేసిన ఇష్టారాజ్యంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ఆటోలను నిలుపుతున్నారని పలువురు వాపోతున్నారు. ఈ ట్రాఫిక్ సమస్యలను పోలీస్ అధికారులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



తపాల శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్ల సంఘం నాయకులు

హామీలు అమలు చేయాలని వలంటీర్ల నిరసన

పొన్నూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో వలంటీర్లకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలుచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గద్దె వెంకటభవానీప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పోస్టు ఆఫీస్ వద్ద వలంటీర్ల సంఘం నాయకులు నిరసన తెలిపి ముఖ్యమంత్రికి వినతి పత్రాలను పోస్ట్‌లో పంపించారు. ఈ సందర్భంగా భవానీ ప్రసాద్ మాట్లాడుతూ కరోనా సమయంలో వలంటీర్లు రోగులకు ప్రాణాలను అడ్డుపెట్టి సేవలు అందించారన్నారు. వలంటీర్లు ఏ రాజకీయ పార్టీకి లోబడి పనిచేయలేదన్నారు. రాష్ట్రానికి చెందిన యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని కోరారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వలంటీర్లకు రూ.10 వేల వేతనం, ఉద్యోగుల భద్రత కల్పిస్తానని పెండింగ్ గౌరవ వేతనం విడుదల చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు షేక్ జానీ, గోపి, మోహన్, మల్లేశ్వరి, పర్వీన్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆరేటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

లాటరీ నిర్వాహకులపై కేసు నమోదు

తెనాలి క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగిల్ నెంబర్ లాటరీ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. స్థానిక షరాఫ్ బజారులో ఓ టీ కొట్టు కేంద్రంగా సింగిల్ లాటరీ నిర్వహిస్తున్న షేక్ మస్తాన్‌వలి, అహ్మద్ బాషాలపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ విధానంలో కేరళకు చెందిన లాటరీ సంస్థ నిర్వాహకులకు అనుబంధంగా ఈ సింగిల్ లాటరీ నిర్వహిస్తున్నారని సీఐ తెలిపారు.